ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5 శ్రీ సత్యసాయి జిల్లా వార్తలు

ఆదివారం 24 మార్చి 2024



హనుమంతవాహనంపై విహరిస్తున్న శ్రీవారు

బంటు భుజాలపై దేవదేవుడు

హనుమంతవాహనంపై కోనేటి రాయుడి విహారం

కదిరి, మార్చి 23: పట్టణంలో వెలసిన శ్రీఖాద్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారు తన బంటు అయిన హనుమంతుని భుజాలపై ఆసీనులై, పురవీధుల్లో విహరించారు. ఉదయం నిత్యపూజలు, హోమాల అనంతరం శ్రీవారికి ప్రత్యేకాలంకరణలో గ్రామోత్సవం నిర్వహిస్తారు. త్రేతాయుగంలో రామలక్ష్మణలను తన భుజస్కందాలపై మోసిన హనుమంతుడు, కలియుగంలో మరోసారి నారసింహుడికి వాహనంగా మారి, తన కోరికను తీర్చుకుంటారని భక్తుల విశ్వాసం. రంగురంగుల విద్యుద్దీపాలు, మల్లె సౌరభాల నడుమ తిరువీధుల్లో విహరించిన శ్రీవారిని దర్శించుకోవడానికి వేలాదిమంది భక్తులు తరలివచ్చారు. నారసింహ నామస్మరణతో కదిరి పురవీధులు మార్మోగాయి.



స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

నేడు బ్రహ్మగరుడసేవ

బ్రహోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీవారికి బ్రహ్మగరుడసేవ నిర్వహించనున్నారు. ఈ ఉత్సవానికి ఎనలేని ప్రముఖ్యత ఉంది. ఉత్సవాలకు అధిపతి అయిన బ్రహ్మదేవుడు తన ఇష్ట వాహనమైన గరుత్మంతుడిని నారసింహుడికి వాహనంగా పంపుతారని భక్తుల నమ్మకం. అందుకే ఈ ఉత్సవాన్ని బ్రహ్మగరుడ సేవ అని పిలుస్తారు. ఉదయం నిత్యపూజలు, హోమాల అనంతరం శ్రీవారి గ్రామోత్సవం నిర్వహిస్తారు. సంధ్యాసమయలో గరుడదండం ప్రతిష్ఠించి, శ్రీవారిని తిరువీధుల్లో ఊరేగిస్తారు. ఆదివారం నుంచి కొక్కంటి పాలెగాళ్లు.. శ్రీవారి సేవలో భాగస్తులై, దివిటీని మోస్తారు.

వలస ఓటర్లపై వైసీపీ గురి..!

- ఇప్పటి నుంచే తాయిలాలు ఇవ్వడానికి సిద్ధం
- నేరుగా పంపిణీకి శ్రీకారం
- పోలింగ్‌కు ముందు నగదు కూడా..



కర్ణాటకలో పట్టుబడ్డ జగన్ బొమ్మ ఉన్న చేతిగడియారాలు (ఫైల్)



హిందూపురం

ఎన్నికల సమయంలో ఓటర్లకు తాయిలాలు ఇవ్వడం, వారిని తమవైపు తిప్పుకునేందుకు ప్రయత్నించడం సహజం. ఈసారి అధికార పార్టీ అందుకు భిన్నంగా 50 రోజుల ముందే వలస ఓటర్లకు గేలం వేసేందుకు సిద్ధమైంది. దీనినిబట్టి అధికార పార్టీ అడ్డదారులు ఎలా తొక్కుతుందో అర్థం చేసుకోవచ్చు. జిల్లాకు చెందిన చాలామంది వివిధ పనులపై పొట్ట చేతబట్టుకుని కర్ణాటకకు వలస వెళ్లారు. వారి ఓట్లను ఎలాగైనా తమవైపు తిప్పుకోవాలని అధికార పార్టీ తరపున పోటీలో ఉన్న అభ్యర్థులు స్కెచ్ వేశారు. దానికి అనుగుణంగా మొదట వస్తురూపేనా వారికి నేరుగా అందజేసి, ఎన్నికల సమయంలో మరోసారి నగదు బదిలీచేసేందుకు పథకం పన్నినట్లు సమాచారం. అందుకు అనుగుణంగానే బుధవారం కర్ణాటక సరిహద్దు బాగేపల్లి టోల్‌గేట్ వద్ద జగన్ బొమ్మ ఉన్న వాచీలను వలస ఓటర్లకు అందజేసేందుకు తీసుకెళ్తుండగా పట్టుబడ్డారు. దీనినిబట్టి వైసీపీ ఏస్థాయిలో ఓటర్లను మభ్య పెట్టేందుకు యోచిస్తుందో తెలుస్తోంది.

ఇప్పటి నుంచే తాయిలాలు

సాధారణంగా బరిలో ఉన్న ప్రధాన పార్టీలు ఓటర్లను ఆకర్షించేందుకు తాయిలాలను పోలింగ్‌కు వారం ముందు ఇచ్చే పద్ధతి గతంలో ఉండేది. ఈసారి ఎన్నికల కోడ్ ముందుగా రావడంతో సమయం చాలా ఉంది. కొన్ని నియోజకవర్గాల్లో ఇప్పటికే ప్రచారం ఊపందుకుంది. ఈ పరిస్థితుల్లో వైసీపీ నాయకులు ముందుగానే వలస ఓటర్లను ఆకట్టుకునేందుకు తాయిలాలను అందించేందుకు సిద్ధమయ్యారు. మొదట నేరుగా వలస ఓటర్ల వద్దకు వెళ్లి తాయిలాలు అందజేసి, వారిని ప్రసన్నం చేసుకునేందుకు శ్రీకారం చుట్టారు. కర్ణాటకలో జిల్లా ఓటర్లు సుమారు 2.5 లక్షల మంది ఉన్నట్లు సమాచారం. ఒక్క హిందూపురం నియోజకవర్గంలోనే 20వేల మందికిపైగా వల స ఓటర్లు ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. హిందూపురం నియోజకవర్గంలో అధికార పార్టీ నాయకులు బెంగళూరుతోపాటు కర్ణాటకలోని ఇతర ప్రాంతాల్లో ఉన్నవారికి ఇక్కడి నుంచి చీరలు పంపిణీ చేస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే వారి ఫోన్ నంబర్లు ఆరాతీశారు.

పోలింగ్‌కు ముందు నగదు బదిలీ..

మొదట వలస ఓటర్లకు చీరలు తీసుకెళ్లి నేరుగా అందజేసి, ఆ తరువాత వారి ఫోన్‌నంబర్లు ఆరాతీసి పోలింగ్‌కు కొన్ని రోజుల ముందు నగదు బదిలీ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఎన్నికల దగ్గరలో వెళ్తే అంతకు ముందే ప్రత్యర్థి పార్టీ వెళ్లి వారిని ప్రసన్నం చేసుకుంటే తమకు ఇబ్బంది అవుతుందని ముందుగానే వారికి తాయిలాలు అందించి ఆ తరువాత పోలింగ్‌దగ్గరలో నగదు బదిలీ చేస్తామని చెప్పినట్లు సమాచారం. బెంగళూరులో ఉమ్మడి జిల్లాకు చెందిన వలస ఓటర్లు ఎక్కువగా ఉండే ప్రాంతాలను గుర్తించి, నాయకులతోపాటు కొంతమంది కులసంఘాల నాయకులను పంపినట్లు సమాచారం. వీరిని రాత్రిపూట ఓ చోటకు కలిపి ఓటు అభ్యర్థిస్తున్నట్లు తెలిసింది. ఏదిఏమైనా పోలింగ్‌కు చాలా సమయమున్నా ఓటర్లు తమను గుర్తుపెట్టుకునేందుకు ఇప్పుడే తాయిలాల పంపిణీ ప్రారంభించినట్లు అధికార పార్టీ నాయకులు బహిరంగంగా చెప్పుకుంటుండడం గమనార్హం.

ప్రత్యేక బృందాల ఏర్పాటు

పుట్టపర్తి: ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లిన జిల్లావాసులపై వైసీపీ నాయకులు ప్రత్యేక గురి పెట్టినట్లు తెలుస్తోంది. వారిని గుర్తించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసుకున్నట్లు తెలుస్తోంది. పరాయి ప్రాంతంలో కూలి పనులు చేసుకుంటున్న వారిని గుర్తించడానికి ఒక టీం, సాఫ్ట్‌వేర్ ఇతరత్రా ఉద్యోగులను వెతికేందుకు మరో బృందాన్ని ఏర్పాటుచేసినట్లు తెలిసింది. ఆ బృందాల ద్వారా వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. వీరుకాక ఇతర రాష్ట్రాల్లో ఇంజనీరింగ్, వైద్య విద్య, డిగ్రీలు చేస్తున్న వారిని గుర్తించడానికి మరో బృందాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇతర రాష్ట్రాల్లో చదువుతున్న జిల్లా విద్యార్థులు 5 వేలమందిపైనే ఉన్నట్లు సమాచారం. మహా నగరాల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తున్న వారు 20వేలు ఉన్నట్లు సమాచారం. వీరుకాక జిల్లాలో ఆధార్, రేషన్ కార్డులున్న వారు రాష్ట్ర సరిహద్దులోని గౌరీబిదనూరు, చిక్‌బళాపూర్, బాగేపల్లి, మధుగిరి, శిర, పావగడ ప్రాంతాల్లో చిన్నచిన్న పనులు చేసుకుంటూ అక్కడే నివాసం ఉంటున్నారు. వీరందరిని గుర్తించి ముందస్తుగా తాయిళాలతో వైసీపీ వైపు తిప్పుకునేందుకు ఆ పార్టీ నాయకులు ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తున్నట్లు తెలుస్తోంది. వారి ఫోన్ నంబర్లు, నివాసాలను ముందస్తుగా గుర్తించాలని ప్రత్యేక బృందాలను పురమాయించినట్లు సమాచారం. వలస ఓటర్లను కలిసి ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని వివరించాలని ఆయా అభ్యర్థులు.. ప్రత్యేక బృందాలకు సూచించినట్లు తెలుస్తోంది. వారం దరూ పోలింగ్‌లో పాల్గొనాలనీ, అందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలంటూ నాయకత్వం ఆదేశించినట్లు సమాచారం. ఇప్పటికే ఆయా బృందాలు.. వలస ఓటర్ల వివరాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యాయి. వీరిపై ఎన్నికల సంఘం నిఘా ఉండదన్న నమ్మకంతో వలస ఓటర్లపై దూసుకెళ్తున్నట్లు తెలుస్తోంది.

సిఫార్సు బదిలీ..!

- ప్రమోషన్‌పై వచ్చారు.. డెప్యుటేషన్‌పై వెళ్లారు..
- ఓ వైద్య ఉద్యోగి పైరవీలు
- పురం ఆస్పత్రికి ట్రాన్స్‌ఫర్‌పై వచ్చి సెలవులోకి..
- ఆ వెంటనే పాత స్థానానికి సిఫార్సు బదిలీ



హిందూపురం అర్బన్, మార్చి 23: సిఫార్సు బదిలీకి ఇది పరాకాష్ట. ప్రభుత్వ శాఖల్లో పైరవీలతో ఏదైనా సాధ్యమనడానికి వైద్య ఉద్యోగి బదిలీ వ్యవహారమే నిదర్శనం. ఉద్యోగోన్నతిపై బదిలీ చేస్తే.. రోజులు తిరక్కుండానే పాత స్థానానికి సిఫార్సుతో డెప్యుటేషన్ వేయించుకున్నారు ఓ వైద్య ఉద్యోగి. బదిలీపై వచ్చిన చోట అవసరం ఉన్నా.. పట్టించుకోలేదు. పాతస్థానంలో అవసరం లేకున్నా.. ఆ పోస్టే లేకున్నా సిఫార్సుతో డెప్యుటేషన్ వేశారు. ఈ తంతు చూసి వైద్య ఉద్యోగులే ముక్కున వేలేసుకుంటున్నారు.

అన్ని సదుపాయాలున్నా..

ప్రభుత్వం ఇటీవల వైద్యశాఖలో ఉద్యోగోన్నతులిచ్చి, బదిలీలు చేపట్టింది. అర్హతలను బట్టి చాలామంది బదిలీల్లో తమకు అనుకూలమైన స్థానాలు ఎంచుకున్నారు. హిందూపురంలోని ప్రభుత్వాస్పత్రి జిల్లాలోనే పెద్దది. టీడీపీ హయాంలో ఎన్నో వైద్య సదుపాయాలు కల్పించడంతోపాటు సిబ్బందిని నియమించారు. అలాంటి ఆస్పత్రికి కదిరి నుంచి ఓ జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగోన్నతిపై సీనియర్ అసిస్టెంట్‌గా ఇటీవలే వచ్చారు. వచ్చీరాగానే సెలవుపై వెళ్లిపోయారు. తరువాత వైద్యశాఖ కమిషనర్ నుంచి డిప్యుటేషన్ ఉత్తర్వులతో వచ్చారు. వాటితో తిరిగి కదిరి ఆస్పత్రికే వెళ్లిపోయారు. కదిరిలో పోస్టు లేకపోయినా, ఎక్సెస్‌గా సిబ్బంది ఉన్నా అక్కడకే ఎలా పోస్టింగ్ ఇచ్చారన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. దీంతో పురం జిల్లా ఆస్పత్రిలో సిబ్బంది కొరత ఏర్పడింది. ఇక్కడ ఒక ఆఫీసు సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్ ఉన్నారు. ముగ్గురు జూనియర్ అసిస్టెంట్ల కొరత ఉంది. ఔట్‌సోర్సింగ్ వారితో పని చేయిస్తున్నారు. దీంతో మరణ, జనన ధృవీకరణ పత్రాలు కూడా ఆఫీస్ సబార్డినేట్‌తోనే చేయిస్తున్నారు. పర్మినెంట్ ఉద్యోగులు చేయాల్సిన పని సబార్డినేట్ సిబ్బందితో చేయిస్తే ఏదైనా తప్పు జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అనంతపురం సర్వజనాస్పత్రిలో కూడా లేని అత్యాధునిక వైద్య సదుపాయాలు హిందూపురం ఆస్పత్రిలో ఉన్నాయి. దీని కోసం ప్రభుత్వం ఒక అనాలధిస్ట్ పోస్టును కూడా క్రియేట్ చేసింది. ఆ మేరకు నాలుగు నెలల క్రితం చిత్తూరు నుంచి ఒక అనాలధిస్ట్‌ను నియమించింది. ఆమె పలుకుబడిని ఉపయోగించి ఆ వెంటనే చిత్తూరుకు డిప్యుటేషన్ వేయించుకున్నారు. లక్షల రూపాయల విలువైన యంత్ర పరికరాలున్నా.. జూనియర్‌తో పని చేయిస్తున్నారు. సిఫార్సు బదిలీలతో జిల్లా ఆస్పత్రిలో సిబ్బంది కొరత ఏర్పడింది. దీంతో కొన్ని పరీక్షలు బయటికి రెఫర్ చేస్తున్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

సూపరింటెండెంట్‌కు తెలియకుండా..

ల్యాబ్ టెక్నీషియన్లు, ఎంఎన్‌ఓలు తదితరులు సూపరింటెండెంట్‌కు కూడా తెలియకుండా నేరుగా డీసీహెచ్ సిఫార్సులతో వచ్చి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోతున్నారు. ఇటీవల ఒక డెంటల్ టెక్నీషియన్ మడకశిరకు, ఎంఎన్‌ఓ ధర్మవరం వెళ్లారు.

డీఎస్సీ చైర్మన్ కలెక్టరే అయినా..

జిల్లా సెలెక్షన్ కమిటీ (డీఎస్సీ) చైర్మన్‌గా కలెక్టర్ ఉంటారు. ఆయనను కాదని బదిలీలన్నీ అనంతపురం డీసీహెచ్ నడుపుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. డీఎస్సీ చైర్మన్ అయిన కలెక్టర్‌కు కూడా తెలియకుండా బదిలీలు జరుగుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వివరాలు చెప్పేందుకు సూపరింటెండెంట్ నిరాకరిస్తుండడం గమనార్హం. అక్కడితో ఆగకుండా సర్దుకుపోతున్నామంటూ కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తుండడం శోచనీయం.

డేటా తెప్పించి సర్దుబాటు చేస్తాం

జిల్లావ్యాప్తంగా వైద్యులు, సిబ్బంది డేటా తెప్పించి ఎక్కడ కొరత ఉందో అక్కడికి సర్దుబాటు చేస్తాం. మంగళవారానికి పూర్తి వివరాలు తెలుస్తాయి. వారంలోగా అన్ని సర్దుబాట్లు పూర్తి చేస్తాం. కదిరికి డెప్యుటేషన్‌పై వెళ్లిన ఉద్యోగికి సంబంధించి నేరుగా కమిషనర్ నుంచి ఆర్డర్ వచ్చింది. ఉన్నతాధికారుల ఆర్డర్‌ను అనుమతించాలి కాబట్టి పంపాం.

- పాల్ రవికుమార్, డీసీహెచ్

ఈసీ చూస్తోంది..

- ప్రభుత్వోద్యోగులూ పారాహుషార్..!
- ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నా.. మద్దతు పలికినా వేటే..
- పార్టీలతో అంటకాగిన వారి కదలికలపై ఆరా
- సోషల్ మీడియాలో పోస్టింగులపై ప్రత్యేక నజర్
- ఇప్పటికే హెచ్చరికలు
- పోలీసుల డేగ కన్ను





పుట్టపర్తి, ఆంధ్రజ్యోతి

సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలతో కోడ్ అమలులోకి వచ్చింది. రాష్ట్రంలో విచ్చలవిడితనం పరాకాష్టకు చేరిందన్నది బహిరంగ రహస్యమే. పలువురు పోలీసులు, ప్రభుత్వోద్యోగులు.. వైసీపీతో అంటకాగారన్న విమర్శలు మూటగట్టుకున్నారు. ఎన్నికల వేళ కూడా అదే ధోరణి అవలంబించేందుకు సిద్ధమయ్యారు. అధికార పార్టీ అండ ఉండడంతో తమను ఎవరేం చేస్తారనే ధీమా వారిలో ఉండింది. కోడ్ అమలులోకి వచ్చిన వారంలోనే పరిస్థితులు తారుమారయ్యాయి. ఎన్నికల నియమావళి ఉల్లంఘనను ఎన్నికల సంఘం (ఈసీ) సీరియస్‌గా పరిగణిస్తోంది. పార్టీల ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నా.. వారితో అంటకాగినా ఏమాత్రం ఉపేక్షించకుండా ఉద్యోగులు, వలంటీర్లపై వేటు వేస్తోంది. అంతేకాదు, వారిపై పూర్తిస్థాయిలో నిఘా ఉంచినట్లు తెలుస్తోంది. వారి సోషల్ మీడియా పోస్టులపై కూడా కన్నేసినట్లు సమాచారం. ఏమాత్రం పార్టీలకు అనుకూలంగా వ్యవహరించినా, కోడ్‌ను ఉల్లంఘించినా చర్యలు తప్పవన్న సంకేతాన్ని ఈసీ పంపుతోంది. ఇటీవలిగా తీసుకుంటున్న చర్యలే ఇందుకు నిదర్శనం.

ఈసీ నిఘా

కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాల సూచనలతో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని జిల్లా ఉన్నతాధికారులు పక్కాగా అమలు చేస్తున్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి రాగానే జిల్లావ్యాప్తంగా ఆయా పార్టీల ప్రచార హోర్డింగులు, పోస్టర్లు, ఫ్లెక్సీలు, బ్యానర్లను తొలగించారు. పార్టీల నేతల విగ్రహాలకు ముసుగులు తొడిగారు. జాతీయ రహదారులు, జిల్లాలోని అంతర్గత రోడ్లలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి, పోలీసు యంత్రాంగం ఎక్కడికక్కడ వాహన తనిఖీలు చేపట్టింది. ఆయా మండలాల్లో అత్యంత సమస్యాత్మక ప్రాంతాలపై నిఘా పెట్టడంతోపాటు అక్రమ మద్యం నిల్వలపై కన్నేస్తున్నారు. ప్రభుత్వోద్యోగుల పని తీరుపై విమర్శలు వెలువడితే వారిపై వేటు వేసేందుకు సైతం ఈసీ నిఘా పెట్టిందన్న వాదన అధికార వర్గాల నుంచి వినిపిస్తోంది. కోడ్ అమలులోకి వచ్చినా.. రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో కొందరు ఉద్యోగులతోపాటు వలంటీర్లు ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి వైసీపీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేస్తున్నారు. పలువురు అనుకూలంగా వ్యవహరిస్తున్నారు. వారిపై ఈసీ కొరడా ఝుళిపిస్తోంది. వైసీపీతో అంటకాగిన ప్రభుత్వోద్యోగుల కదలికలపై ఆరా తీయడంతోపాటు వారి తీరు, సోషల్ మీడియాలో వారి పోస్టింగులపై ఈసీ నిఘా పెట్టినట్లు తెలుస్తోంది. నిబంధనలు అతిక్రమిస్తే వేటు వేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే ఎన్నికల నియమావళి పాటించాలనీ, పార్టీలకు దూరంగా ఉండాలని ఇప్పటికే ఉద్యోగులకు జిల్లా కలెక్టర్ సూచించారు.

అంటకాగితే అంతే...

ప్రభుత్వ, ఒప్పంద ఉద్యోగులతోపాటు వలంటీర్లు ఎవరూ తమను గమనించలేదన్న భావనతో రాజకీయ పార్టీలకు అనుకూలంగా ప్రచార సభల్లో పాల్గొంటే వేటు పడినట్లే. సామాజిక మధ్యమాల్లో ఫొటోలు, వీడియోలపై నిరంతర నిఘా ఉంటుందన్న నేపథ్యంలో రాజకీయ సభలు, సమావేశాలకు హాజరుకాకపోవడమే ఉత్తమమని ఉద్యోగులకు ఉన్నతాధికారులు ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశారు. ఇటీవల జిల్లాలో కొందరు ఉద్యోగులు విధులకు ఎగనామం పెడుతూ అధికార పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనడం, సంఘం పేర్లు చెబుతూ నాయకులతో అంటకాగి తిరుగుతున్న వారిని ఉన్నతాధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. ఎన్ని విమర్శలు వచ్చినా ఆ ఉద్యోగులను కట్టడి చేయడంలో ఉన్నతాధికారులు విఫలమవుతూనే వచ్చారు. ప్రభుత్వ ఉద్యోగిగా కొనసాగుతూ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొన్నా, ప్రచారానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించినా సోషల్ మీడియాలో రాజకీయ పార్టీలకు అనుకూలంగా పోస్టులు పెట్టే ఉద్యోగులపై ఈసీ చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఇప్పటికే అధికార పార్టీతో అంటకాగిన ప్రభుత్వ ఉద్యోగులతోపాటు వలంటీర్ల కదలికలపై ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో మాదిరిగానే ఎవరూ ఏం చేయలేరనే భావనతో వ్యవహరిస్తున్న వారిపై ఎన్నికల వేళ కొరడా ఝుళిపించే అవకాశాలు లేకపోలేదు. ఈనేపథ్యంలో ఎన్నికల నియమావళిని అతిక్రమించే ఉద్యోగులపై ఈసీ నిఘా పెట్టింది. జిల్లావ్యాప్తంగా ఆయా నియోజకవర్గాల్లో వైసీపీ అభ్యర్థుల వెంట ప్రచారంలో వలంటీర్లు పాల్గొంటున్నారు. అందుకు సంబంధించిన ఆధారాలతో టీడీపీ, జనసేన, బీజేపీలు.. ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేస్తున్నాయి. జిల్లాలో వైసీపీ అభ్యర్థుల వెంట ప్రచారంతో పాల్గొన్న వలంటీర్లపై చర్యలు చేపట్టలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

పోలీసుల డేగ కన్ను

ఎన్నికలొస్తే రెవెన్యూ, పోలీసు అధికారులపై అదనపు ఒత్తిడి సాధారణమే. నాలుగో విడతలో రాష్ట్రంలో పోలింగ్ నిర్వహిస్తున్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ చేతిలో సర్వాధికారాలున్నాయి. ఈ నేపథ్యంలో ఎక్కడ, ఏ చిన్న పొరబాటు జరిగినా వారి ఉద్యోగానికి చేటు వచ్చే ప్రమాదం ఉంది. పోలీసు శాఖ ఇప్పటికే కర్ణాటక సరిహద్దు, ప్రధాన రహదారులు, అంతర్గత రోడ్లలో ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి, తనిఖీలు చేపట్టింది. ఆయా నియోజకవర్గాల్లోని అత్యంత సమస్యాత్మక ప్రాంతాల్లో రౌడీ షీటర్లు, నేరచరితుల ప్రవర్తన తీరుపై ఆరా తీస్తున్నారు. జిల్లాకు భారీగా కర్ణాటక సరిహద్దు ద్వారా అక్రమ మద్యం రవాణా అవుతోంది. దీనికి అడ్డుకట్ట వేసి, అక్రమ నిల్వలను గుర్తించి మద్యాన్ని సీజ్ చేయడంతోపాటు కేసులు నమోదు చేస్తున్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి కోడ్‌ను జిల్లా అధికారులు పక్కాగా అమలు చేసేందుకు చర్యలు చేపట్టారు. ఓటర్లను ప్రభావితం చేసే నగదు, పలు రకాల వస్తువులు, బహుమతులు వంటి తాయిలాల పంపిణీపై నిఘాపెట్టారు. సాధారణ వ్యక్తుల నుంచి ఆయా పార్టీల నాయకులు సైతం రూ.50 వేలు మించి వ్యాపారం, ఆస్పత్రి అవసరాలు, శుభకార్యాల నిమిత్తం తీసుకెళ్లాల్సి వస్తే పత్రాలు చూపాలని పోలీసలు సూచిస్తున్నారు. లేదంటే సీజ్ చేసే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

ఉష్ణోగ్రతలు	శని	
	గరిష్ఠం	కనిష్ఠం
పుట్టపర్తి	38.0	24.0
కదిరి	37.0	23.0
ధర్మవరం	38.0	24.0
హిందూపురం	37.0	23.0
పెనుకొండ	37.0	24.0

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సెహరీ
పుట్టపర్తి	6.34 ఆదివారం (సాయంత్రం)	4.58 సోమవారం (ఉదయం)
కదిరి	6.31 ఆదివారం (సాయంత్రం)	5.05 సోమవారం (ఉదయం)
ధర్మవరం	6.36 ఆదివారం (సాయంత్రం)	5.02 సోమవారం (ఉదయం)
హిందూపురం	6.34 ఆదివారం (సాయంత్రం)	5.06 సోమవారం (ఉదయం)
పెనుకొండ	6.32 ఆదివారం (సాయంత్రం)	5.04 సోమవారం (ఉదయం)

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి..!

హిందూపురం అర్బన్, మార్చి 23: జిల్లాలోని గురుకుల పాఠశాలల్లో 5, 6, 7, 8 తరగతుల్లో మిగిలిపోయిన సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కొడిగెనహళ్ళి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ మురళీధర్‌బాబు శనివారం ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరంలో గురుకులాల్లో విద్యార్థులు చేరగా.. మిగిలిపోయిన సీట్ల భర్తీకి ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రాయలసీమతోపాటు నెల్లూరు జిల్లాలో 4వ తరగతి చదువుతున్న గ్రామీణ పేద విద్యార్థులు ఐదో తరగతి ప్రవేశానికి అర్హులన్నారు. 6, 7, 8 తరగతుల్లో మిగిలిపోయిన సీట్లకు అడ్మిషన్ పొందవచ్చన్నారు. ఏపీఆర్ఎస్-సీఏటీ అర్హత పరీక్షల్లో మెరిట్ ఆధారంగా అడ్మిషన్ కల్పిస్తారన్నారు. వివరాలకు 8179119659 నంబరులో సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

పది పరీక్షలకు 3044 మంది గైర్హాజరు

అనంతపురం విద్య, మార్చి 23: పదో తరగతి పరీక్షలకు 3044 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. శనివారం జిల్లా వ్యాప్తంగా 142 కేంద్రాల్లో ఫిజికల్ సైన్స్ పరీక్షలు నిర్వహించారు. రెగ్యులర్ విద్యార్థులు 31,330 మందికిగాను 30,958 మంది హాజరు కాగా 372 మంది గైర్హాజరయ్యారు. ప్రైవేట్ విద్యార్థులు 5057 మందికిగాను 2385 మంది హాజరుకాగా 2672 మంది గైర్హాజరయ్యారు. గైర్హాజరయ్యే విద్యార్థులు ఎక్కువ శాతం ప్రైవేట్ విద్యార్థులు కావడం గమనార్హం. అదేవిధంగా ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు జిల్లా వ్యాప్తంగా 32 కేంద్రాలను తనిఖీలు చేశాయి.

శ్రీసత్యసాయి జిల్లాలో..


పరీక్షలను తనిఖీ చేస్తున్న కలెక్టర్

కొత్తచెరువు, మార్చి 23: శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా శనివారం జరిగిన పదో తరగతి ఫిజికల్ సైన్స్ పరీక్షకు 1323 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీఈఓ మీనాక్షి తెలిపారు. జిల్లాలో 115 కేంద్రాలలో 25,0779 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా.. 1323 మంది గైర్హాజరయ్యారన్నారు. 24,456 మంది పరీక్ష రాశారన్నారు. దీంతో 94.87 హాజరు శాతం నమోదైందని డీఈఓ తెలిపారు. పలు పరీక్ష కేంద్రాలను కలెక్టర్ అరుణ్‌బాబు, ఆర్డీఓ భాగ్యరేఖ తనిఖీ చేశారు.

31లోగా దరఖాస్తు చేసుకోండి

కొత్తచెరువు, మార్చి 23: జిల్లాలోని గురుకుల విద్యాలయాలలో 5,6,7,8వ తరగతుల ప్రవేశానికి ఈనెల 31వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ మీనాక్షి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో http-saprs.apcfss.in ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అన్ని తరగతుల ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 25న ప్రవేశపరీక్షలు ఉంటాయన్నారు. అవకాశాన్ని అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా డీఎడ్ ఫస్ట్ సెమిస్టర్‌కు సంబంధించి 2023-25 రెగ్యులర్ అభ్యర్థులతోపాటు 2021-23, 2022-24 బ్యాచ్‌లకు చెందిన ఒకసారి ఫెయిల్ అయిన అభ్యర్థులకు ఏప్రిల్ 22 నుంచి 27వ తేదీ వరకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం 2 నుంచి 4:30 గంటల వరకు ఈ పరీక్షలు జరుగుతాయని ఆమె పేర్కొన్నారు.

ఈవీఎం స్ట్రాంగ్ రూముల తనిఖీ


సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

కళ్యాణదుర్గం రూరల్, మార్చి 23: పట్టణంలోని ఎస్వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎంల స్ట్రాంగ్ రూములను జిల్లా కలెక్టర్ గౌతమి శనివారం తనిఖీ చేశారు. జిల్లా ఎస్పీ అన్బురాజన్, కళ్యాణదుర్గం ఆర్డీఓ రాణి సుష్మితతో కలిసి ఆమె కళాశాలలో ఉన్న ఈవీఎంలు, స్ట్రాంగ్ రూములను, ఈవీఎంల పంపిణీ చేసే కళాశాల గ్రౌండ్‌ను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ శాంతియుత, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా పటిష్ట భద్రత ఏర్పాటు చేస్తున్నామన్నారు. కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. 24 గంటలు సీసీ కెమెరాల ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. అక్రమంగా మద్యం, నగదును తరలించడం, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తప్పవ న్నారు. ప్రతి పౌరుడు శాంతియుత వాతావరణంలో ఓటు వేసే పరిస్థితులను ఏర్పాటు చేస్తామన్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన 48 గంటల్లోపు బహిరంగ, ప్రభుత్వ స్థలాల్లో ఉన్న ఫ్లెక్సీలు, హోర్డింగులు, బ్యానర్లను తొలగించామన్నారు. ప్రైవేటు బిల్డింగ్‌పై కూడా ఎటువంటి హోర్డింగులు ఉండకూడదన్నారు. రాజకీయ ప్రచార కార్యక్రమాల్లో ప్రభుత్వ ఉద్యోగులు, వలంటీర్లు, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు ఎవరైనా పాల్గొంటే వేటు తప్పదన్నారు.

జీడిపల్లికి ఆగిన నీటి సరఫరా

బెళుగుప్ప, మార్చి 23: మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు నీటి సరఫరా ఆగిపోయినట్లు హంద్రీనీవా అధికారులు శనివారం తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయరు నుంచి 400 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఉందన్నారు. ప్రస్తుతం నీటి నిల్వ 0.418 టీఎంసీలు ఉందని తెలిపారు.

వైఎస్సార్ రైతు బీమా పోర్టల్ బంద్

- ఆన్‌లైన్‌లో అలాగే సీఎం బొమ్మ.. పార్టీ రంగులు
- ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు ఇబ్బందులు



ఆన్‌లైన్‌లో నిర్వహణలో ఉన్నట్లు చూపుతున్న రైతు బీమా పోర్టల్

అనంతపురం అర్బన్, మార్చి 23: అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలు ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఏర్పాటు చేసిన వైఎస్సార్ రైతు బీమా పోర్టల్ బంద్ అయ్యింది. ఈ నెల 16న ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పోర్టల్‌లో సీఎం జగన్ బొమ్మ, వైసీపీ రంగులను తొలగించేందుకు పోర్టల్‌ను మూసేశారు. వారం గడుస్తున్నా పోర్టల్ ఓపెన్ చేయలేదు. దీంతో ఆత్మహత్య చేసుకున్న రైతుల వివరాలను రిజిస్ట్రేషన్ చేసేందుకు వీఆర్వోలకు అవకాశం లేకుండాపోయింది. తహసీల్దారు, ఆర్డీఓ కూడా జిల్లా నుంచి రాష్ట్ర స్థాయికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను పంపలేకపోతున్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చాక శింగనమల, గార్లదిన్నె, గుత్తి ప్రాంతాలలో ముగ్గురు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఎన్నికల కోడ్‌కు ముందే మరికొందరు రైతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. బాధిత కుటుంబాలు మండలస్థాయి అధికారులను కలిసినా.. ఆన్‌లైన్‌లో దరఖాస్తులను అప్‌లోడ్ చేయలేదు. ఎన్నికలు ముగిసిన తరువాత రావాలని అధికారులు చెప్పి పంపుతున్నారు. ఆత్మహత్య చేసుకున్న ఒక్కో రైతు కుటుంబానికి ప్రభుత్వం రూ.7 లక్షల ఆర్థిక సాయం అందిస్తోంది. అధికారులు సకాలంలో ఆన్‌లైన్ ప్రక్రియను పూర్తి చేస్తే నెల రోజుల్లో నామినీ ఖాతాకు రూ.7లక్షలు జమ అవుతుంది. బాధిత రైతు కుటుంబాలకు రైతు సాధికార సంస్థ ద్వారా ఆర్థిక సాయం అందుతోంది. కోడ్ నుంచి ఈ సాయానికి ఎన్నికల కమిషన్ మినహాయింపు ఇచ్చిందని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం తహసీల్దార్లు, ఆర్డీఓలు ఎన్నికల విధుల్లో ఉన్నారు. ఇప్పట్లో దరఖాస్తులు తీసుకునే పరిస్థితి లేదని అంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి.. పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది. పోర్టల్‌లో సీఎం బొమ్మ, పార్టీ రంగులు తొలగించి, త్వరలో పోర్టల్ ఓపెన్ చేస్తామని జేడీఏ ఉమామహేశ్వరమ్మ తెలిపారు.

ఇష్టం లేకుంటే వెళ్లిపోండి..!

పాఠశాలలు తనిఖీ చేయకుంటే ఎలా..?

- సమగ్ర శిక్ష ఏపీసీపై ప్రిన్సిపల్ సెక్రటరీ ఫైర్
- పరీక్షల క్యాంప్ మార్చాలని డీఈఓకు ఆదేశం
- పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ


ఎండీఎం ఏడీ నాగరాజును ప్రశ్నిస్తున్న ప్రవీణ్‌ప్రకాష్

అనంతపురం విద్య, మార్చి 23: 'ఆఫీస్‌లో కూర్చోవడం కాదు.. స్కూళ్లను విజిట్ చేయండి. ఇష్టం లేకుంటే మీ శాఖకు వెళ్లిపోండి. విద్యాశాఖలో పనిచేయడానికి చాలా మంది ఉన్నారు..' అంటూ సమగ్రశిక్ష ఏపీసీ వరప్రసాద్ రావుపై విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రవీణ్ ప్రకాష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నేను వస్తున్నానని హడావుడి చేయడం కాదు. మీకు చేతులెత్తి మొక్కుతా.. పిల్లల కోసం పనిచేయండి' అని అన్నారు. మధ్యాహ్న భోజన పథకం (ఎండీఎం) విభాగం ఏడీ నాగరాజుకు సైతం ఆయన చీవాట్లు పెట్టారు. పదో తరగతి పరీక్షల క్యాంపును పాఠశాలలో నిర్వహించడం తగదని, వచ్చే ఏడాది మార్చాలని డీఈఓ వరలక్ష్మికి హెచ్చరించారు. జిల్లాలో ఆయన శనివారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు.

అందరికీ వార్నింగ్

- శారదా పాఠశాలలో ఆర్వో ప్లాంట్స్‌ను తనిఖీ చేసి, జిల్లాకు ఎన్ని ఆర్వో ప్లాంట్స్ వచ్చాయని ఏపీసీని అడిగారు. ఏపీసీ నీళ్లు నమలడంతో సమగ్రశిక్ష ఉద్యోగి గురుముని కృష్ణ కలుగజేసుకుని, 830 ఆర్వో ప్లాంట్స్‌కు ఇండెంట్ పంపామని, 438 జిల్లాకు సప్లై చేశారని, 12 ఇన్‌స్టలేషన్ చేశారని వివరించారు. మిగిలినవి ఈ నెలాఖరులోగా పూర్తి చేస్తామని అన్నారు. పాఠశాలలో ఆర్వో ప్లాంట్ పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు.
- శారదా పాఠశాల సమీపంలోని సునీత నగర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రవీణ్ ప్రకాష్ తనిఖీ చేశారు. స్కూల్‌కు దగ్గరల్లోనే ఉన్నా, ఆవరణలో నిర్వహించకుండా రూ.5,500 అద్దె చెల్లించడం ఎందుకని ప్రశ్నించారు. పిల్లలకు ఇకపై చదువు బాగా చెప్పాలని సిబ్బందికి సూచించారు.
- కేఎస్ఆర్ హైస్కూల్‌లో ఐఎఫ్‌పీ ప్యానల్స్, ట్యాబ్స్ పనితీరును పరిశీలించారు. ఐఎఫ్‌పీ ప్యానల్స్‌ను వినియోగించడంపై టీచర్లకు అవగాహన లేకపోవడాన్ని గమనించి, ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్యాబ్స్, ఐఎఫ్‌పీ ప్యానల్స్ వినియోగం గురించి ఏప్రిల్ 30లోగా నేర్చుకుని, తనకు వీడియో పంపాలని హెచ్ఎం నారాయణకు సూచించారు. రూ.కోట్లు ఖర్చు చేసి బెంచీలు ఇస్తే పిల్లలను నేలపై కూర్చోబెట్టడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈలోగా ఎండీఎం ఏడీ నాగరాజు అక్కడికి రావడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. 'విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ వస్తున్నా మీకు వచ్చేందుకు తీరిక లేదా? రాకూడదని నిర్ణయించుకున్నావా..?' అని మండిపడ్డారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.


కేఎస్ఆర్ పాఠశాలలో విద్యాశాఖ అధికారులకు సూచనలు ఇస్తున్న ప్రవీణ్ ప్రకాష్

- పదో తరగతి పరీక్షల క్యాంపును కేఎస్ఆర్ స్కూల్‌లో నిర్వహించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. డీఈఓ కార్యాలయం, లేదా కలెక్టరేట్‌లో పెట్టుకోవాలని సూచించారు. అడిగితే ఎంతైనా డబ్బులిస్తామని, వచ్చే ఏడాది నుంచి క్యాంపు మార్చాలని డీఈఓను ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ శ్రీనివాసు, ఎంఈఓ వెంకటస్వామి, సమగ్రశిక్ష ఉద్యోగులు పాల్గొన్నారు.

పాఠాలు బాగా చెబుతున్నారా..?

అనంతపురం మూడో రోడ్డులోని శారద మున్సిపల్ ప్రైమరీ స్కూల్‌ను ఆర్జేడీ రాఘవరెడ్డి, డీఈఓ వరలక్ష్మితో కలసి ప్రవీణ్ ప్రకాష్ తనిఖీ చేశారు. 'మీ టీచర్లు పాఠాలు బాగా చెబుతున్నారా..?' అని విద్యార్థులను ఆరా తీశారు. జగనన్న గోరుముద్ద వంటలను పరిశీలించారు. ఎండీఎం ఏడీ నాగరాజు అక్కడ లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలోని టాయిలెట్స్‌లో కొన్ని కొళాయిలు మొరాయించడంతో హెచ్ఎం, సచివాలయం సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. ఆ తరువాత వచ్చిన సమగ్రశిక్ష ఏపీసీ వరప్రసాదరావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఏపీ ఈడబ్ల్యూఐడీసీ, సచివాలయ ఇంజనీర్లను ఇచ్చాం. అన్ని ఐటమ్స్ నిర్వహణకు డబ్బులు ఇస్తున్నాం. ఇంత కంటే ఏం చేయాలి..?' అని ఏపీసీకి ప్రశ్నించారు. పనిచేయలేకుంటే వెళ్లిపోండి అంటూ అసహనం వ్యక్తం చేశారు. 'నీకు ఆప్షన్ ఉందని రెవెన్యూ శాఖ నుంచి వచ్చావు. నువ్వు వచ్చినా ఇక్కడ ఏం ప్రయోజనం కనిపించడం లేదు..' అని ఏపీసీపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నిత్యం పాఠశాలలకు వెళ్లాలని, వారానికి ఒకసారి వెళితే కుదరదని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

కడప కార్మికులను కబళించిన మృత్యువు


యోసబ్ (ఫైల్)


బండెన్న (ఫైల్)

బుక్కరాయసముద్రం, మార్చి 23: మండల పరిధిలోని రోటరీపురం గ్రామం వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు కడప జిల్లావాసులు మృతిచెందారు. పెద్దముడియం మండలం బలపనగూడురు గ్రామానికి చెందిన బండెన్న (41), యోసబ్(35) బైక్‌పై వెళుతుండగా ఓ ప్రైవేటు బస్సు ఢీకొట్టింది. దీంతో ఇద్దరూ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారని బుక్కరాయసముద్రం సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. బండెన్న, యోసబ్.. పాత భవనాల కూల్చివేత, భవన నిర్మాణ పనులు చేస్తుంటారు. అనంతపురం నగరంలోని ఓ ఇంటి నిర్మాణ పనులు చేసేందుకు ఇద్దరూ శుక్రవారం వచ్చారు. పని ముగించుకుని, శనివారం ఉదయం ద్విచక్రవాహనంలో స్వగ్రామానికి బయలుదేరారు. మార్గ మధ్యంలో.. రోటరీపురం వద్ద ఆగి టిఫిన్ చేశారు. అనంతరం తాడిపత్రి మీదుగా వెళ్లేందుకు రాంగ్ రూట్‌లో బైకును యూ టర్న్ తీసుకునే ప్రయత్నం చేశారు. అదే సమయంలో తాడిపత్రి నుంచి అనంతపురం వైపు వస్తున్న ఓ ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాల బస్సు వీరి బైకును ఢీ కొంది. దీంతో బండెన్న, యోసబ్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. బండెన్నకు భార్య లక్ష్మీదేవి, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. యోసబ్‌కు భార్య కవిత, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. బుక్కరాయసముద్రం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


ప్రమాద స్థలంలో ద్విచక్ర వాహనం, మృతదేహాలు

ప్రచారం చేసేదే..!

- ఏమాత్రం తగ్గని వలంటీర్లు, డీలర్లు, ఉపాధి సిబ్బంది
- వైసీపీ అభ్యర్థులతో కలిసి ప్రచార కరపత్రాల పంపిణీ
- ఉమ్మడి జిల్లాలో పలువురిపై వేటు

(న్యూస్ నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి అనంతపురం జిల్లాలో వైసీపీ అభ్యర్థుల తరఫున పలువురు వలంటీర్లు, స్టోర్ డీలర్లు, ఉపాధి హామీ సిబ్బంది ప్రచారం కొనసాగిస్తున్నారు. అధికారులు రోజువారీ చర్యలు తీసుకుంటున్నా.. ఏమాత్రం జంకడం లేదు. పలు నియోజకవర్గాలలో శనివారం కూడా ప్రచారాలను కొనసాగించారు. పలువురిని అధికారులు విధుల నుంచి తొలగించారు.

- పుట్టపర్తిలో వైసీపీ అభ్యర్థి దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డితో కలిసి 3వ వార్డు వలంటీర్ రమణ శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ అంజయ్య.. వివరణ ఇవ్వాలని నోటీసులు జారీ చేశారు.
- నల్లచెరువు మండలంలో వైసీపీ కదిరి నియోజకవర్గ అభ్యర్థి మగ్బూల్‌తో కలిసి పలువురు వలంటీర్లు, యానిమేటర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రచారంలో పాల్గొన్నారు. తవళంమర్రి వెలుగు యానిమేటర్ బి.శ్రీనివాసులు పలువురిని వైసీపీ అభ్యర్థి వద్దకు తీసుకెళ్లారు. ఇదే గ్రామానికి చెందిన వలంటీరు బీరప్పను వైసీపీ బూత్ కన్వీనర్‌గా నియమించారు.


నీలంపల్లి స్టోర్ డీలరు భర్త ప్రభాకర్‌రెడ్డి ప్రచారం

- శింగనమల నియోజకవర్గంలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజినేయులు, అనంతపురం ఎంపీ అభ్యర్థి శంకరనారాయణకు మద్దతుగా పలువురు స్టోర్ డీలర్లు, వలంటీర్లు శనివారం ప్రచారం నిర్వహించారు. బుక్కరాయసముద్రం మండలం నీలంపల్లి, బుక్కరాయసముద్రం గ్రామ పంచాయతీ పరిధిలో ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. నీలంపల్లిలో స్టోర్ డీలరు భర్త ప్రభాకరరెడ్డి, బుక్కరాయసముద్రంలో డీలర్లు శేషానందారెడ్డి, డీలర్ తండ్రి రాజారెడ్డి తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు. కొంతమంది వలంటీర్లు ప్రచార ర్యాలీలో వెనుక నడిచారు. ప్రచారంలో పాల్గొన్న కొత్తపల్లి డీలరు కుమారుడు భాస్కర్‌పై రెవెన్యూ అధికారులు నామమాత్రపు చర్యలు తీసుకున్నారు. డీలరు లైసెన్సు రద్దు చేయకుండా, భాస్కర్ పేరిట ఉన్న ఈ పోస్ హక్కును మాత్రమే తొలిగించారు.
- తనకల్లు మండలం రాచినేపల్లిలో వైసీపీ అభ్యర్థి మగ్బూల్‌తో కలిసి వలంటీరు రాచినేని కమలాకర్‌నాయుడు ప్రచారంలో పాల్గొన్నాడు.


ప్రచారంలో పాల్గొన్న వలంటీర్ కమలాకర్ (నల్లగీతల చొక్కా వేసుకున్న వ్యక్తి)


ప్రచారంలో పాల్గొన్న యానిమేటర్ బి. శ్రీనివాసులు

వేటు పడింది..


విధుల నుంచి తొలగించబడిన వలంటీర్ పెద్దన్న


కుర్మాజీపేటలో ఇద్దరు వలంటీర్లను తొలగిస్తూ ఎంపీడీఓ ఇచ్చిన ఉత్తర్వు

- తాడిపత్రి మండలం గన్నేవారిపల్లికాలనీకి చెందిన వలంటీర్ పెద్దన్న అలియాస్ విజయ్‌ను విధుల నుంచి తొలగించినట్లు ఎంపీడీఓ నరసింహారావు తెలిపారు. టీడీపీకి ఓటువేస్తే ప్రస్తుత పథకాలు రావని, జగన్‌కు ఓటువేసి గెలిపించాలని పెద్దన్న చెబుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీంతో ఎంపీడీఓ చర్యలు తీసుకున్నారు.
- యాడికి మండలంలో వైసీపీ తరఫున ప్రచారంలో పాల్గొన్న ఇద్దరు వలంటీర్లను ఎంపీడీఓ సావిత్రి విధుల నుంచి తొలగించారు. కుర్మాజీపేటలో తాడిపత్రి వైసీపీ అభ్యర్థి పెద్దారెడ్డి తనయుడు హర్షవర్ధన్‌రెడ్డితో కలిసి వలంటీర్లు రాజశేఖర్, రామాంజనేయులు ప్రచారం చేశారు. దీనిపై ఆంధ్రజ్యోతిలో శనివారం కథనం ప్రచురితమైంది. దీంతో వారిపై చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వం ఇచ్చిన సిమ్‌కార్డులు, బయో మెట్రిక్ డివైజ్‌లు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు.
- కదిరి వైసీపీ అభ్యర్థి మగ్బూల్‌తో కలిసి ప్రచారంలో పాల్గొన్న వలంటీర్లు ఎర్రదొడ్డి గౌతమ్‌నాయక్, సోమశేఖర్‌నాయక్, ముత్యాలచెరువు నరసింహారెడ్డి, కొండమనాయునిపాళ్యం బూకే బాలాజీ నాయక్‌ను విధుల నుంచి తొలగిస్తూ.. ఎంపీడీఓ అంజనప్ప శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

చర్యలు ఎప్పుడు..?


ప్రచారంలో వలంటీర్ వెంకటేశ్ (ఫైల్)

శింగనమల నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థి తరఫున ప్రచారంలో పాల్గొన్న వలంటీర్లు, స్టోర్ డీలర్లు, ఓ ఉద్యోగిపై అధికారులు ఇంకా చర్యలు తీసుకోలేదు. షోకాజ్ నోటీసులతో సరిపెట్టారు. రాచేపల్లి పంచాయతీ కార్యదర్శి డొక్క కృష్ణ, వెస్టు నరసాపురం ఫీల్డ్ అసిస్టెంట్ పట్నం భాస్కర్, చిన్నజలాలపురం వలంటీర్ వెంకటేశ్ ప్రచారం పాల్గొన్నారు. దీనిపై ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. ఎన్నికల అధికారులు స్పందించి షోకాజ్ నోటీసులు ఇచ్చారు. ఆ తరువాత ఎలాంటి చర్యలూ లేకపోవడం విమర్శలకు తావిస్తోంది.

విశాఖ డ్రగ్స్ వెనుక వైసీపీ నేతల హస్తం

మాజీ మంత్రి పరిటాల సునీత


కనగానపల్లి మండలం నరసంపల్లిలో మాట్లాడుతున్న పరిటాల సునీత

ధర్మవరం రూరల్, మార్చి 23: విశాఖ డ్రగ్స్ సరఫరా వెనుక వైసీపీ నేతల హస్తం ఉందని మాజీ మంత్రి పరిటాల సునీత ఆరోపించారు. డ్రగ్స్ మాఫియాలో వైసీపీ నేతలు ఉన్నారని తెలుసుకున్న సజ్జల రామకృష్ణారెడ్డి, టీడీపీపై ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనగానపల్లి మండలంలో శనివారం ఆమె ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. నరసంపల్లి, యలక్కుంట్ల, బద్దలాపురం తదితర గ్రామాలలో ఆమె పర్యటించారు. డ్రగ్స్ వ్యవహారంలో వైసీపీ నేతలు దొంగే దొంగ అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. వైసీపీ నాయకులతో నిందితులకు సంబంధాలు ఉన్నాయనే విషయం రాష్ట్ర ప్రజలకు తెలుసునని అన్నారు. కూనం వీరభద్రరావుకు వైసీపీ నాయకులతో సంబంధాలున్నాయని, సంక్రాంతి సంబరాల్లో ఆయన ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలలో జగన్, వైసీపీ నేతల ఫొటోలు ఉన్నాయని అన్నారు. దీనికి సమాధానం చెప్పకుండా టీడీపీపై ఎదురుదాడి చేస్తున్నారని మండిపడ్డారు. జగన్ ఐదేళ్లపాలనలో రాష్ట్రాన్ని గంజాయి రాష్ట్రంగా మార్చేశారని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్‌ను డ్రగ్స్ క్యాపిటల్‌గా మార్చిన ఘనత వైసీపీకే దక్కుతుందని ఎద్దేవా చేశారు. గతంలో కాకినాడ ఎమ్మెల్యే డ్రగ్స్ కేసులో ఇరుక్కున్నారని, ఆ కేసులో ఇప్పటివరకు ఎటువంటి పురోగతి లేదని అన్నారు. వైసీపీ నేతల అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారని, ఈ ఎన్నికల్లో ప్రజలు జగన్‌కు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. డ్రగ్స్ వ్యవహారంపై సీఎం జగన్ ఎందుకు నోరువిప్పడం లేదని ఆమె ప్రశ్నించారు. డ్రగ్స్ మాఫియా నుంచి ఆంధ్రప్రదేశ్‌ను కాపాడుకోవాల్సిన అవసరం ప్రజలకు ఉందని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నెట్టెం వెంకటేష్, సీనియర్ నాయకులు ఎల్.నారాయణచౌదరి, మండల కన్వీనర్ యాతం పోతలయ్య తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్ మాఫియాతో యువత బతుకు ఛిద్రం

టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి



పెనుకొండ, మార్చి 23 : రాష్ట్రంలో డ్రగ్స్ మాఫియావల్ల యువత బతుకు చిద్రం అవుతోందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి పేర్కొన్నారు. ఈ డ్రగ్ మాఫియాకు వైసీపీ ప్రభుత్వమే మూలకారణమని విమర్శించారు. ఈ మేరకు ఆయన శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఒకప్పుడు పరిశ్రమల కేంద్రంగా ఉన్న ఆంధ్రప్రదేశ్ నేడు జగన్‌పాలనలో డ్రగ్స్ దిగుమతికి మొదటి స్థానంలో నిలిచిందన్నారు. ఇటీవల విశాఖలో కంటెయినర్లలో 25వేల కిలోల భయంకరమైన మత్తుపదార్థాలు సీబీఐ అధికారులకు దొరికాయని, వాటి విలువ రూ.50 వేల కోట్లు ఉంటుందన్నారు. రాష్ట్రానికి కంటెయినర్‌లో డ్రగ్స్ తీసుకురావడం సామాన్య విషయం కాదన్నారు. వాటి పరిశీలనను మొదట అడ్డుకున్న రాష్ట్ర అధికారులకు ఈ డ్రగ్స్‌తో సంబంధం ఏంటని ప్రశ్నించారు. యువత భవిష్యత్తుకు ఈ మత్తుపదార్థాలు అత్యంత ప్రమాదకరమైనవన్నారు. కల్తీమద్యం, పనికి రాని బ్రాండ్ అక్రమ మద్యం ద్వారా రాష్ట్ర పరిస్థితిని ఏ దశకు తీసుకెళ్తున్నారని ప్రశ్నించారు. వైసీపీ నేత విజయ్‌సాయిరెడ్డి, సీఎం జగన్ కలిసి ఇలాంటి అరాచక పనులు చేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. దీనిపై టీడీపీ అధినేత చంద్రబాబుకు సపోర్ట్‌చేసే పార్టీలపై బురద జల్లడం సిగ్గుచేటన్నారు. ఈ తతంగంలో భాగస్వామ్యులందరూ త్వరలోనే బయటకు వస్తారన్నారు. డ్రగ్ రాకెట్‌లో ప్రభుత్వం ప్రమేయం బయటపెడతామన్నారు. రాబోయే ఎన్నికల్లో అల్లర్లు సృష్టించడానికే ఇంత భారీస్థాయిలో కుట్ర జరుగుతోందన్నారు. ముఖ్యమంత్రి ప్రమేయం లేకుండానే ఇంత జరుగుతుందా అని ప్రశ్నించారు. ఇంత స్థాయిలో డ్రగ్స్ సరఫరా జరగడం దేశ చరిత్రలో మొట్టమొదటిసారి అన్నారు.

ఆర్యవైశ్యులను వర్గాలుగా చీల్చారు

- ఒక్కచాన్స్ పేరుతో జగన్ వంచించారు
- వైసీపీ పాలనలో ఆర్యవైశ్యులపై పెరిగిన దాడులు
- విచ్ఛిన్నమైన వ్యాపారాలు
- టీడీపీ వాణిజ్య విభాగ రాష్ట్ర అధ్యక్షుడు డుండి రాకేష్





వ్యాపారి గళం కార్యక్రమానికి హాజరైన ఆర్యవైశ్యులు, మాట్లాడుతున్న వాణిజ్య విభాగ రాష్ట్ర అధ్యక్షుడు డుండి రాకేష్

హిందూపురం, మార్చి 23: వైసీపీ పాలనలో సీఎం జగన్.. ఆర్యవైశ్యులను నానా ఇబ్బందులు పెట్టారనీ, నాలుగు వర్గాలుగా విభజించాడని టీడీపీ వాణిజ్య విభాగ రాష్ట్ర అధ్యక్షుడు డుండి రాకేష్ మండిపడ్డారు. స్థానిక పరమేశ్వరి హాల్‌లో శనివారం రాత్రి వ్యాపారి గళం పేరుతో ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో డుండి రాకేష్ మాట్లాడుతూ.. కులగణన పేరుతో ఆర్యవైశ్యులను సీఎం జగన్ నాలుగు వర్గాలుగా చీల్చాడన్నారు. తద్వారా ఆర్యవైశ్యుల బలం తక్కువ చేసి, చూపించే ప్రయత్నం చేశాడన్నారు. టీడీపీ హయాంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటుచేసి రూ.30 కోట్లు కేటాయించారన్నారు. పేదలకు సబ్సిడీ రుణాలు అందించారన్నారు. టీడీపీ హయాంలో పన్నుల భారం లేదన్నారు. ప్రస్తుతం చెత్త పన్ను, షాపుల పన్ను, ట్రేడ్ లైసెన్స్ పెంచి ఆర్యవైశ్యులను నిట్టనిలువునా మోసం చేస్తున్నారన్నారు. ఎన్నికల నోటిఫికేషన్‌కు ఒక్క రోజు ముందు ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటుచేసి కించపరిచారని మండిపడ్డారు. రాజకీయంగా, వ్యాపార పరంగా ఈ ఐదేళ్లలో ఆర్యవైశ్యులు చాలా నష్టపోయారని వాపోయారు. ఆర్యవైశ్యుల గొంతు కోయడానికి ముఖ్యమంత్రి సిద్ధమయ్యారన్నారు. మాజీ ముఖ్యమంత్రి రోశయ్య విగ్రహానికి పూలమాల వేయడానికి వెళ్తే అడ్డుకున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. వైసీపీ పాలనలో ఆర్యవైశ్యులకు అన్ని రకాలుగా మోసం జరిగిందనీ, చిరు వ్యాపారులు ఇబ్బంది పడుతున్నారన్నారు. హిందూపురంలో ఆర్యవైశ్యుల భూముల వ్యవహారంలో అధికార పార్టీలోని ఒక వర్గం మోసం చేసిందని ఆరోపించారు. రాష్ట్రంలో వ్యాపారుల పరిస్థితి డేంజర్ జోన్‌లో పడిందన్నారు. ఒక్క చాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చి జగన్ వంచించాడన్నారు. వీటన్నింటినీ గుర్తుంచుకుని, ఆలోచించి ఓటెయ్యాలన్నారు. ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు, వాణిజ్య విభాగ జిల్లా అధ్యక్షుడు జేపీకే రాము, కౌన్సిలర్ రాఘవేంద్ర, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ ఆదర్శ, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వరప్రసాద్, ఆర్యవైశ్య సంఘం నాయకులు నంబూరి సతీష్, శ్రీకాంత్, దాస సందీప్, హిమబిందు, వాణిజ్య విభాగ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అరుణాచల రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ రజనీకాంత్, ఆర్యవైశ్యులు, వ్యాపారులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్‌పై ప్రచారం


ప్రజలకు కరపత్రాలు అందిస్తున్న టీడీపీ నాయకులు

తనకల్లు, మార్చి 23: మండలకేంద్రం లోని తారకరామనగర్‌లో శనివారం సూపర్ సిక్స్ పథకాలపై టీడీపీ శ్రేణులు ప్రచారం నిర్వహించారు. తెలుగు మహిళా అధ్యక్షురాలు తోట సరోజమ్మ, మైనార్టీ నాయకుడు జియావుల్లా తదితరులు ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు ప్రకటించిన పథకాల గురించి వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. టీడీపీ అధికారంలోకి వస్తే ఈ పథకాలన్నీ అమలవుతాయని, వాటి వల్ల అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయానికి కృషి చేయాలని కోరారు. పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం.. ఇద్దరి అరెస్టు

ధర్మవరం, మార్చి 23: పట్టణంలో ఓ హోటల్ వద్ద కర్ణాటక మద్యం అమ్ముతున్న ఇద్దరిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 13 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు వన్‌టౌన్ సీఐ సుబ్రమణ్యం తెలిపారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో అరెస్టు వివరాలను వెల్లడించారు. స్థానిక సాయినగర్‌లోని ఓ హోటల్‌లో వనం లక్ష్మీనారాయణ, గంగమ్మ అక్రమంగా మద్యాన్ని అమ్ముతున్నట్టు సమాచారం రావడంతో.. తాను ఏఎస్ఐ పుట్టప్ప, సిబ్బంది అబ్దుల్, శశికళ కలిసి వెళ్లి 13 బాటిళ్ల కర్ణాటక మద్యంను స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే అమ్ముతున్న ఆ ఇద్దరినీ అరెస్టు చేశామన్నారు. ఎవరైనా అక్రమంగా మద్యాన్ని అమ్మినా, రవాణా చేసినా, గంజాయి అమ్మినా,మట్కా, పేకాట ఆడినా అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

డాబాల్లో మద్యం అమ్మితే చర్యలు: పట్టణంలోని డాబాలు కానీ చిన్నచిన్న హోటళ్లలో కానీ మద్యాన్ని అమ్మినా, తాపించినా యజమానులపై కేసులు నమోదు చేస్తామని సీఐ హెచ్చరించారు. శుక్రవారం రాత్రి డాబాలలో దాడులు నిర్వహించి మద్యం తాగుతున్న 9మందిని అరెస్టు చేశామన్నారు. వీరందరిపై కేసులు నమోదు చేశామన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున మద్యం అమ్మినా, తాపినా చర్యలు తప్పవని అన్నారు.

కాటమయ్యస్వామి ఉత్సవాలు ప్రారంభం


ప్రత్యేకాలంకరణలో కాటమయ్యస్వామి

బత్తలపల్లి మార్చి23: మండలంలోని సంజీవపురం కాటికోటేశ్వర స్వామి ఉత్సవాలు శనివారం నుంచి ప్రారంభమైనట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కాటికోటేశ్వర స్వామి ఉత్సవాలకు ఉమ్మడి జిల్లా నలు మూలల నుంచి భక్తు లు అధిక సఖ్యలో హాజరవుతారన్నారు. మొదటి రోజు రెడ్డివారి బోనాలు, బ్రాహ్మణ సంప్రోక్షణ, ధ్వజారోహణ కైంకర్యాలు నిర్వహించామన్నారు. రెండోరోజైన ఆదివారం కాటమయ్యస్వామి ఉత్సవ మూర్తిని అశ్వ, గజ, నంది వాహనాలపై కొలువుదీర్చి ఊరేగిస్తామన్నారు. ముష్టూరు నుంచి కాటమయ్యస్వామి కొండ వద్ద వరకు ఊరేగిం పు చేస్తామన్నారు. మూడో రోజు సోమవారం కరణం, రెడ్డి వారి కుటుంబాలు కలిసి రెడ్డివారి ఇంటిలో వేలాదిమంది భక్తులు తేనేటి విందు స్వీకరించి అనంతరం ముస్టూరు నుంచి కాటమయ్యస్వామి కొండ వద్దకు ఊరేగింపుగా చేరుకుంటారని, ఆ తర్వాత ఉత్సవ మూర్తికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని చెప్పారు. ఈ సందర్భం గా బాణసంచా కాల్చి ఆనందంగా లంకా దహనం నిర్వహిస్తారన్నారు. నాలుగో రో జు మంగళవారం చివరి రోజున భక్తులు ఆలయం వద్దకు అధిక సంఖ్యలో వచ్చి పూజల్లో పాల్గొంటారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

డ్రైవర్ నిర్లక్ష్యానికి ఒకరి మృతి


లెక్కల దామోదర్ నాయుడు (ఫైల్)

పుట్టపర్తి రూరల్, మార్చి 23: డ్రైవర్ నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలైన ఘటన జిల్లాకేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. మృతుడి బంధువులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. జిల్లాకేంద్రంలో లెక్కల దామోదర్‌నాయుడు (45) హోటల్‌ను నిర్వహిస్తూ జీవనం సాగించేవారు. కాగా స్థానికంగా ఉన్న ఈశ్వరమ్మ పాఠశాలలో 7వతరగతి చదువుతున్న తన కుమారుడు కార్తీక్‌కు మధ్యాహ్నం 12 గంటల సమయంలో భోజనం క్యారియర్ ఇచ్చేందుకు స్కూటీలో బయలుదేరాడు. అయితే ప్రైమరీ స్కూల్ గేట్ ఎదురుగా రోడ్డులో అడ్డంగా నిలిపి ఉన్న ఇన్నోవా వాహన డ్రైవర్ కుడి పక్కన డోరును చూసుకోకుండా.. షడెన్‌గా తీశాడు. దీంతో పక్కనే వెళ్తున్న దామోదర్ నాయుడుకు బలంగా తగలడంతో కిందపడిపోయాడు. స్థానికులు వెంటనే అతడిని హుటాహుటిన సత్యసాయి జనరల్ హాస్పిటల్‌కు తరలించారు. ప్రథమచికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు తరలించారు. అక్కడ ఓప్రవేట్ ఆసుపత్రిలో వైద్యులు పరిశీలించి అప్పటికే అతను మృతి చెందినట్లు ధృవీకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి అన్న లోకేష్‌నాయుడు పుట్టపర్తి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దామోదర్‌నాయుడి భార్య గీత పదేళ్ల క్రితం రోడ్డుప్రమాదంలో మృతిచెందారు. ప్రస్తుతం అతను కూడా మరణించడంతో కుమార్తె జస్మిత, కుమారుడు కార్తీక్ దిక్కులేనివారయ్యారు. పుట్టపర్తి అర్బన్ సీఐ కొండారెడ్డి కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

'పుట్టపర్తి కోర్టు పనితీరు భేష్'


ఏడీజే శోభారాణికి సత్యసాయి చిత్రపటాన్ని అందిస్తున్న దృశ్యం

పుట్టపర్తి రూరల్, మార్చి 23: జిల్లాకేంద్రంలోని జూనియర్ సివిల్‌కోర్టు పనితీరు భేషుగ్గా ఉందని ఫోర్త్ అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ న్యాయాధికారి ఎం శోభారాణి సంతృప్తి వ్యక్తం చేశారు. న్యాయాధికారి శనివారం వార్షిక తనిఖీల్లో భాగంగా పుట్టపర్తి జూనియర్ సివిల్‌కోర్టును సందర్శించి కోర్టు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కోర్టులో కేసుల సత్వర పరిష్కారంలో మంచి పురోగతి ఉందన్నారు. బార్ అండ్ బెంచ్ మధ్య సత్సంబంధాలు ఉన్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. కోర్టుపరిసరాలు చక్కగా తీర్చిదిద్దడంలో స్థానిక న్యాయాధికారి చొరవ బాగుందన్నారు. న్యాయవాదులు కేసుల సత్వర పరిస్కారంలో చక్కటి సహకారం అందించాలని ఆమె ఆకాంక్షించారు. అనంతరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కత్తి గంగిరెడ్డి, సభ్యులు యదుభూషణ్, కృష్ణమూర్తి, అబూబకర్, ఇందిర, నాగేంద్ర, హరికృష్ణ గౌడ్ తదితరులు ఏడీజేను శాలువాతో సత్కరించి సత్యసాయి బాబా చిత్రపటాన్ని బహూకరించారు.

సబ్ జైలులో న్యాయవిజ్ఞాన సదస్సు

కదిరిలీగల్, మార్చి 23: పట్టణంలోని సబ్‌జైలును మండల న్యాయాధికారి సేవా సంస్థ చైర్‌పర్సన్, న్యాయమూర్తి ఎస్. జయలక్ష్మి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ ఖైదీలకు నాయవిజ్ఞాన సదస్సు నిర్వహించి మాట్లాడారు. సబ్ జైలు నుంచి మీ ఊళ్లకు వెళ్లిన తరువాత ఇక్కడ అనుభవాలను, న్యాయ వ్యవస్థ ద్వారా వివరించిన అంశాలను ప్రచారం సాగించాలన్నారు. ఇక్కడున్నన్ని రోజులు మీరు ఎంత స్వేచ్ఛను కోల్పోయారో కూడా ప్రజలకు తెలపాలని సూచించారు. అనంతరం అక్కడ అందుతున్న భోజనం, ఇతర సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు, సభ్యులు దశరథనాయక్, సిరాజుద్దీన్, జైలాధికారి వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ సీట్లను బీసీలకు కేటాయించాలి

ముదిగుబ్బ, మార్చి 23: ఉమ్మడి అనంతపురం జిల్లా పార్లమెంట్ సీట్లను బీసీలకు కేటాయించాలని బీసీ ఐక్యవేదిక రాయలసీమ అధ్యక్షుడు కొట్వాలశ్రీరాములు కోరారు. మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రధాన రాజకీయ పార్టీలన్నీ అనంతపురం పార్లమెంటు సీటును కురుబలకు, హిందూపురం పార్లమెంటు సీటును వాల్మీకులకు కేటాయించాలని, అలాగే వడ్డెర్లకు ఎమ్మెల్సీ సీటును కేటాయించాలని కోరారు. తెలుగుదేశం ఆవిర్భావం నుంచి వాల్మీకులు, కురుబలు, వడ్డెర్లు అండగా ఉన్నారన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో కురుబ, వడ్డెర, వాల్మీకి ఓట్లు అధికంగా ఉండడంతో, వారికి సీట్లు కేటాయిస్తే గెలుపు తథ్యమన్నారు. కార్యక్రమంలో బీసీ నాయకులు మల్లెల నారాయణస్వామి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో పొరపాట్లకు తావివ్వరాదు

- ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకట శివరామిరెడ్డి


మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటశివరామిరెడ్డి

ధర్మవరం, మార్చి 23: ఎన్నికల విధులలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వరాదని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటశివరామిరెడ్డి సూచించారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయ సమావేశపు భవనంలో శనివారం ఆయన రూట్ ఆఫీసర్లకు ఎన్నికల విధులపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికలలో బాధ్యతతో కూడిన విధులను నిర్వర్తించాలని, ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావివ్వరాదని అన్నారు. ప్రతి ఓటరు తమ ఓటుహక్కును వినియోగించుకునే విధంగా సహాయ సహకారాలు అందించాలన్నారు. అదేవిధంగా తాము పంపిణీ చేసిన ప్రొఫార్మాను ఎన్నికల నిబంధనల ప్రకారం భర్తీ చేసి అందజేయాలన్నారు. నిర్లక్ష్య ధోరణి ఉంటే చర్యలు తప్పవన్నారు. ప్రతి వార్డులోని పోలింగ్ బూత్‌లలో అన్ని వసతులు ఉన్నాయా.. లేదా అని పరిశీలించాలన్నారు. మహిళలకు, పురుషులకు వేర్వేరుగా మరుగుదొడ్లు, ర్యాంపులు ఉండాలన్నారు. సార్వత్రిక ఎన్నికల విజయవంతానికి చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ రమేశ్, ఎన్నికల డీటీ షణ్ముఖ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా పెట్టండి


సున్నంపల్లి వద్ద చెక్‌పోస్టును పరిశీలిస్తున్న ఆర్వో భాగ్యరేఖ

ఓబుళదేవరచెరువు, మార్చి 23: కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో ఎన్నికల దృష్ట్యా ప్రత్యేక నిఘా ఉంచి తనిఖీలు నిర్వహించాలని పోలీసులకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి భాగ్యరేఖ ఆదేశించారు. మండలంలోని కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన సున్నంపల్లి వద్ద ఏర్పాటు చేసినచెక్ పోస్టును శనివారం ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో ఏయే గ్రామాలు వస్తాయి, వాటిపై ఎలాంటి నిఘా పెట్టాలనేదానిపై ఎస్ఐ వంశీకృష్ణకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆమె వెంట తహసీల్దార్ ఖాజాబీ, ఆర్ఐ నాగేంద్ర, ఏఎస్ఐ కిషోర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఘనంగా పోషణ్ పక్వాడా ముగింపు వేడుకలు


బొంతలపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో చిరుధాన్యాల ఉపయోగం గురించి వివరిస్తున్న సూపర్‌వైజర్

తనకల్లు, మార్చి 23: పోషణ్ పక్వాడా ముగింపు వేడుకలను మండలంలోని బొంతలపల్లి, నారేవాండ్లపల్లి, మార్పురివాండ్లపల్లి, సింగిరివాండ్లపల్లి, గంగసానివారిపల్లి, గందోడివారిపల్లి గ్రామాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవమ్మ పాల్గొని, సిబ్బంది ఏర్పాటు చేసిన చిరుధాన్యాలు, ఆకుకూరలు, కాయకూరలు, ధాన్యాల స్టాల్స్‌ను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, కిశోర బాలికలు రక్తహీనతకు గురికాకుండా ఉండాలంటే అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టకాహారాన్ని వినియోగించాలన్నారు. వీటితోపాటు స్థానికంగా లభించే చిరుధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయలు, పాలు, పండ్లు కూడా తీసుకోవాలని సూచించారు. వంటలు తయారుచేసేటప్పుడు పోషకవిలువలు కోల్పోకుండా చూసుకోవాలన్నారు. చిరుధాన్యాలలోని పోషకాల గురించి వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు రామక్క, భారతి, మీనాక్షి, రాజీ, చంద్రకళ, అరుణ అరుణ, రమణమ్మ, మేనక, రమాదేవి, పంచాయతీ కార్యదర్శి మాధవి, అంగన్‌వాడీ ఆయాలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

ఓబుళదేవరచెరువు: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని సీడీపీఓ వరలక్ష్మి, సూపర్ వైజర్ విజయకుమారి సూచించారు. మండలంలోని పగడాలవారిపల్లిలో శనివారం పోషణ్ పక్వాడా వారోత్సవాలను నిర్వహించారు. ఈసందర్భంగా సిబ్బంది పౌష్టికాహార స్టాల్స్‌ను ఏర్పాటు చేసి పోషకాలతో కూడాన పదార్థాలు, ఆకుకూరలును ప్రదర్శించారు. అనంతరం సీడీపీఓ, సూపర్‌వైజర్ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తప్పక తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా పాలు, గుడ్లు, చిరుధాన్యాలు, ఆకుకూరల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రమీల, సుకన్య, స్వర్ణ, షమీమ్, పార్వతి, సునంద, శ్యామల, మంజుల, వెంకటరమణమ్మ, ఇందిర, ఆయాలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

చోరీ అయిన బంగారు ఆభరణాలు రికవరీ

- బాధితురాలికి అప్పగింత

ధర్మవరం, మార్చి 23: పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురంలో వారం రోజుల క్రితం దుకాణంలోకి ముగ్గురు వ్యక్తులు చొరబడి అమృతవల్లి అనే మహిళ గొంతుకోసి బంగారు ఆభరణాలను అపహరించిన విషయం తెలిసిందే. బాధితు రాలు ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ సీఐ సుబ్రమణ్యం కేసు నమోదు చేసుకుని దుండుగల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. రెండు రోజుల్లో కేసును ఛేదించి చోరీకి పాల్పడిన ముగ్గురు దొంగలను అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరచినట్టు సీఐ తెలిపారు. వీరి నుంచి బంగారు గొలుసు,కమ్మలు, వెండిపూత కలిగిన వినాయక విగ్రహాన్ని స్వాధీనం చేసుకుని శనివారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో బాధితురాలికి సీఐ అప్పగించారు. అభరణాలను ఛేధించడంలో కృషిచేసిన ఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బందిని సీఐ అభినందించారు.

రెచ్చగొట్టే పోస్టులు పెడితే చర్యలు: సీఐ

ముదిగుబ్బ, మార్చి23: ఎన్నికలు సమీపిస్తుండడంతో సోషల్ మీడియాలో గ్రూప్ అడ్మిన్‌లుగా ఉన్న టీడీపీ, బీజేపీ, వైసీపీ, ఇతర పార్టీల నాయకులతో ముదిగుబ్బ సీఐ యతీంద్ర శనివారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సోషల్‌మీడియా గ్రూపులు, వాట్సప్ గ్రూపులలో పెట్టే పోస్టులకు గ్రూప్ అడ్మిన్‌దే బాధ్యతన్నారు. కులం, మతం, ప్రాంతం వంటి ఇతరుల మనోభావాలను దెబ్బతీసే విధంగా పోస్టులు పెట్టరాదన్నారు., అసభ్యకరమైన, అభ్యంతరకరమైన పోస్టులు, రెచ్చగొట్టే పోస్టులు, ఒక వ్యక్తిని టార్గెట్ చేస్తూ హేళనగా ఉన్న పోస్టులు పెట్టరాదన్నారు. అలాంటివాటిని పెడితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: ఎస్ఐ

నల్లచెరువు: ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ కేఎం లింగన్న హెచ్చరించారు. మండలకేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో శనివారం ఆయన సోషల్ మీడియా గ్రూపు అడ్మిన్లకు, పాత్రికేయులకు పలు అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టే వారు నియమ నిబంధనలు పాటించాలన్నారు. అలా పాటించని వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. సోషల్ మీడియాలో సమాజం మీద ప్రభావం చూపే పోస్టులు, అభ్యంతరకర పోస్టులు పెడితే అలాంటివారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో పోలీస్ సిబ్బంది, పాత్రికేయులు, సోషల్ మీడియా వారు పాల్గొన్నారు.

రూ.రెండు లక్షల నగదు స్వాధీనం

తనకల్లు, మార్చి 23: మండలంలోని చీకటిమానుపల్లి వద్ద పోలీసులు అన్నమయ్య జిల్లా సరిహద్దు చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. అక్కడ శనివారం వాహనాలు తనిఖీ చేస్తుండగా తమిళనాడు నుంచి వస్తున్న కారులో రూ.రెండులక్షల నగదు లభ్యమైంది. వాటికి ఆధారాలు లేకపోవడంతో పోలీసులు నగదును స్వాధీనం చేసుకున్నారు. తాను రంజాన్ పండుగకోసం పొట్టేళ్ల కొనుగోలు చేయడానికి డబ్బులు తీసుకొస్తున్నట్లు సనావుల్లా చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఐ ధరణీబాబు తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువులో దొంగలు పడ్డారు..

- రెండు షాపులు, ఒక ఆలయంలో చోరీ


సెల్‌ఫోన్ల దుకాణాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కొత్తచెరువు, మార్చి 23: మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి దొంగలు చెలరేగిపోయారు. రెండు షాపులతో పాటు దేవాలయంలో సైతం చోరీకి పాల్పడ్డారు. స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. ధర్మవరం ప్రధాన రహదారిలోని లోతుకాలువ వద్ద ఉన్న కాల్వ గడ్డ ముత్యాలమ్మ ఆలయం తలుపులను దొంగలు బద్దలకొట్టి లోపలికి ప్రవేశించారని, అమ్మవారికి అలంకరించిన రెండు ముక్కు పొడకలు, చెవికి ఉన్న బంగారు రింగులతో పాటు మూడు వెండి గొడుగులు, హుండీలోని రూ.8వేల నగదును అపహరించారన్నారు. అలాగే ఆలయ సమీపంలోని మార్కెట్ యార్డు వద్ద ఉన్న సెల్‌షాపు తాళాలు పగలకొట్టి దాదాపు రూ.50వేలు విలువ చేసే పలు వస్తువులను ఎత్తుకెళ్లారు. అదేవిధంగా ధర్మవరం రహదారిలోనే సత్తిచికెన్ సెంటర్ తాళాలనూ పగలకొట్టి క్యాష్‌బాక్స్‌లోని రూ.8వేల నగదును ఎత్తుకెళ్లారు. ఒకే రోజు వరుస చోరీలు జరగడంతో స్థాకులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఘటనా స్థలాలను క్లూజ్‌టీం పరిశీలించి వేలిముద్రలను సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ రాజారమేశ్ తెలిపారు.

రెడ్డిపల్లి ఆరోగ్యకేంద్రం పరిశీలన

నల్లమాడ, మార్చి 23: మండలంలోని రెడ్డిపల్లి ప్రభుత్వ ఆరోగ్యకేంద్రాన్ని డీఎంహెచ్ఓ ఎస్వీ కృష్ణారెడ్డి శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవలను పరిశీలించారు. అలాగే ల్యాబ్ పరికరాలను, రక్తపరీక్షల నమూనాలను, ఓపీ రిజిస్టరు, వైద్య సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. ఆసుపత్రిలో రోగులకు సరిపడా మందులున్నాయా.. లేవా.. అని స్థానిక సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మందులు నిలువ ఉన్న గదిని, ప్రసవాల గదిని పరిశీలించారు. మాతా శిశు మరణాలు జరగకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట వైద్యాధికారి గణేనాయక్, సూపర్‌వైజరు మంజుల, వైద్య సిబ్బంది ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

బత్తలపల్లి, మార్చి23: మండలంలోని గుమ్మల్లకుంటలో వరిమడుగు బయపురెడ్డి కి చెందిన వ్యవసాయ పొలంలో గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను శుక్రవారం రాత్రి గుర్తు తెలియని దుండగలు ధ్వంసం చేసి.. అందులోని కాపర్ వైరును చోరీ చేశారు. రైతు శనివారం ఉదయం పొలం వద్దకు వెళ్లి చూడగా.. ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసమై పడి ఉంది. కాపర్‌వైరు కనిపించలేదు. దీంతో చోరీ జరిగిందని గ్రహించిన ఆయన వెంటనే విషయాన్ని ట్రాన్స్‌కో ఏఈ శివయ్య ఫిర్యాదు చేశారు. ఏఈ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సర్వే రాళ్లపై నిర్ణయం ఈసీదే: తహసీల్దార్

తనకల్లు, మార్చి 23: మండలంలోని వివిధ పంచాయతీల్లో ప్రస్తుతం భూ రీసర్వే కార్యక్రమం కొనసాగుతోంది. అందులో భాగంగా జగనన్న భూరక్ష పేరుతో ఉన్న సర్వేరాళ్లను రెవెన్యూశాఖ వారు నాటించారు. కాగా ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఈసర్వే రాళ్లను తొలగించాలని టీడీపీ నాయకులు గత శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిన తహసీల్దార్ శోభాసువర్ణమ్మ శనివారం ఆంధ్రజ్యోతికి వివరణ ఇచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా భూ సర్వే కొనసాగుతోందన్నారు. సర్వేరాళ్లు లక్షలాదిగా ఉన్నాయన్నారు. వాటిని తొలగించాలా, లేక రంగులు వేయాలా, లేక మరేదైనా కొనసాగించాలా అన్నది ఎలక్షన్ కమిషన్ నిర్ణయంపైనే ఆధారడి ఉంటుందని తెలిపారు. ఎన్నికల కమిషన్ నిర్ణయాలను తూచా తప్పకుండా అమలు చేస్తామన్నారు. ఈ విషయంపై ఎన్నికల కమిషన్ తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉందని ఆమె పేర్కొన్నారు.



పాటలు పాడుతున్న విద్యార్థులు

అలరించిన భక్తిగీతాలు

పుట్టపర్తి, మార్చి 23: సత్యసాయి విద్యార్థులు భక్తి గీతాలతో అలరించారు. పట్టణంలోని ప్రశాంతి నిలయంలో గల సాయికుల్వంత్ హాల్లో శనివారం సాయంత్రం బెంగుళూరు బృందావన్ క్యాంపస్‌కు చెందిన సత్యసాయి విద్యార్థులు భక్తి గీతాల ఆలాపన చేపట్టారు. విద్యాసంవత్సరం ముగింపు సందర్భాన్ని పురస్కరించుకుని వారు గంటపాటు భక్తి నివేదనం పేరిట ఈ కార్యక్రమం చేపట్టారు. వారు ఆలపించిన గీతాలు భక్తులను ఎంతగానో అలరించాయి. అనంతరం వారు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

పుట్టపర్తి రూరల్, మార్చి 23: మండల పరిధిలోని జగరాజుపల్లిలో గల ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రమేష్‌బాబు శనివారం సూచించారు. 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ ఎంఈసీ, సీఈసీ కోర్సులకు ఆంగ్లమాధ్యమంలో ఉచిత విద్యాబోధన ఉంటుందన్నారు. ఇందుకు సంబంధించి ఈనెల 28నుంచి మే22వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓసీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు 200రూపాయలు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 150 రూపాయలు దరఖాస్తు రుసుం చెల్లించాల్సి ఉంటుందన్నారు. మార్కుల మెరిట్, రిజర్వేషన్ నిబంధనలకు అనుగుణంగా ప్రవేశాలుంటాయన్నారు. బాలికలకు ఉచిత వసతి సౌకర్యం ఉంటుందని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ముదిగుబ్బ, మార్చి23: మండల కేంద్రంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ట్రాన్స్‌కో అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న దొరిగల్లు, గుంజేపల్లి, ముదిగుబ్బ టౌన్‌లోని ప్రజలు విద్యుత్ అంతరాయానికి సహకరించాలని కోరారు.

భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌కు ఘన నివాళి

కదిరిఅర్బన్, మార్చి 23: పట్టణంలోని సీఐటీయూ నాయకులు తమ కార్యాలయంలో శనివారం భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ.. దేశం కోసం చిన్న వయస్సులోని ప్రాణాలు త్యాగం చేసిన అమరవీరులని కొనియాడారు. దేశానికి స్వాతంత్ర్యకోసం బ్రిటీషు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జగన్మోహన్, నాగరాజు, కృష్ణానాయక్, మాబున్నీసా, ఎస్ఎఫ్ఐ నాయకులు బాబ్‌జాన్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సమాచారం కోసం కాల్‌సెంటర్లు

పుట్టపర్తి, మార్చి 23: జిల్లాలో ఎన్నికల సమాచారం ఎప్పటికప్పుడు సేకరించి రోజువారి నివేదికలను ఎన్నికల కమిషన్‌కు పంపించాలని జిల్లా ఎన్నికల అధికారి అరుణ్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలియచేశారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా కలెక్టరేట్‌లో కాల్‌సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. సీవిజిల్, సువిధ యాప్, కంట్రోల్‌రూం నిర్వహణను కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఎవరైనా సమాచారం అందించాలంటే 18004258795, 18004258796, 18004258797, లకు తెలపాలని సూచించారు.

సజావుగా పది పరీక్షలు

నల్లమాడ, మార్చి 23: మండలంలో పది పరీక్షలు సజావుగా సాగుతున్నాయి. మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నపాఠశాల కేంద్రంలో 368మందికిగాను 344మంది పరీక్షలు రాశారు. 18మంది గైర్హాజరయ్యారు. అలాగే ఆశ్రమ పాఠశాలలో 188మందికి గాను 178మంది పరీక్షలు రాశారు. పదిమంది గైరుహాజరైనట్లు చీఫ్‌లు తెలిపారు.

నేడు టీడీపీలోకి భారీ చేరికలు

ఓబుళదేవరచెరువు, మార్చి 23: మండలంలోని అల్లాపల్లి పంచాయతీ దాద్దిరెడ్డిపల్లి, సున్నపుంపల్లి పంచాయతీ పెద్దగుట్టపల్లిలో ఆదివారం మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి సమక్షంలో భారీగా టీడీపీ తీర్థం పుచ్చుకోనున్నారు. వైసీపీని వీడి టీడీపీలో చేరే కార్యక్రమానికి పల్లెతో పాటు ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూరా పాల్గొనున్నట్లు మండల కన్వీనర్ శెట్టివారి జయచంద్ర శనివారం ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

మాజీ కౌన్సిలర్‌పై దాడి హేయం

గాండ్లపెంట, మార్చి 23: కదిరి పట్టణంలోని నిజాంవలీకాలనీలో ఉన్న టీడీపీ మాజీ కౌన్సిలర్ ఆయూబ్‌ఖాన్‌పై వైసీపీ నాయకులు దాడిచేయడం హేయమని మైనార్టీ మండల నాయకులు ఖండించారు. మండలకేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ నాయకులు ఆయూబ్‌ఖాన్‌ఇంట్లోకి చొరబడి దాడి చేయడం హేయమన్నారు. దాడిచేసినవారిని పోలీసులు కఠినంగా శిక్షించాలన్నారు. ఇలాంటి సంఘటనలు పునావృతం కుండా చూడాలని కోరారు. సమావేశంలో మైనార్టీ మండలఅధ్యక్షుడు అక్రమ్ బాషా, నాయకులు ఖాజావలీ, టోపీసాబ్, అస్రప్ అలీ, ఖాదర్‌అలీ, అమీర్, బాహుద్దీన్, బక్ష్, బాబా, మునాఫ్, రోటరీ ఖాజా తదితరులు పాల్గొన్నారు.

ఘర్షణలో ఒకరికి గాయాలు

కదిరిఅర్బన్, మార్చి 23: మండలంలోని చవిటితండాలో శనివారం జరిగిన రెండుకుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరికి గాయాలయ్యాయి. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. చవిటితండాకు చెందిన తిరుపాల్‌నాయక్, అన్న చంద్రనాయక్ మధ్య భూ తగాదాలున్నాయి. దీనిపై శనివారం రెండు కుటుంబాల వారు ఘర్షణ పడ్డారు. ఇందులో తిరుపాల్‌నాయక్‌కు గాయాలయ్యాయి. అతన్ని చికిత్సకు కుటుంబ సభ్యులు కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు ఈ చంద్రనాయక్, అతని భార్య పార్వతిబాయిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చెక్కు అందజేత

కదిరి అర్బన్, మార్చి 23: ఆర్టీసీలో కండెక్టర్‌గా పని చేస్తూ కొండారెడ్డి 2011లో అనారోగ్యంతో మృతి చెందారు. అయితే అప్పటి నిబంధనల మేరకు వారి కుటుంబంలో ఉద్యోగానికి ప్రత్యామ్నాయంగా అదనపు నగదు రూ.లక్షను ప్రకటించారు. ఆ నగదు ప్రస్తుతం మంజూరు కాగా అందుకు సంబంధించిన చెక్కును జిల్లా రవాణాధికారి, డిపో అసిస్టెంట్ మేనేజర్ హరిమోహన్ శనివారం కండెక్టర్ భార్య రేవతికి అందించారు. కార్యక్రమంలో కార్యాలయం సిబ్బంది ఉన్నారు.

మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లు సీజ్

నల్లమాడ, మార్చి 23: మండలంలోని కుటాలపల్లి చెరువునుంచి నల్లమాడలోకి మట్టిని తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు, రెండు జేసీబీలను శనివారం పట్టుకుని సీజ్‌చేసినట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఇసుక, మట్టి, రాళ్లను అనుమతి లేకుండా తరలిస్తే సీజ్‌చేసి, కేసులు నమోదు చేస్తామన్నారు. ట్రాక్టర్లు, జేసీబీల యజమానులపై కేసు నమోదు చేసి ట్రాక్టర్లును, జేసీబీలను తహసీల్దార్ నాగభూషణంకు అప్పగించినట్లు చెప్పారు.

'పది' పరీక్షలకు 70మంది గైర్హాజరు

లేపాక్షి, మార్చి 23 : పదో తరగతి పరీక్షల్లో భాగంగా శనివారం నిర్వహించిన ఫిజిక్స్ పరీక్షకు మండలకేంద్రంలో 70మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ నాగరాజునాయక్ తెలిపారు. మండలకేంద్రంలోని నాలుగు పరీక్ష కేంద్రాలలో 903మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 833మంది హాజరయ్యారు. మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల ఏ - సెంటర్‌లో 15 మంది, బీ - సెంటర్‌లో పది మంది, జూనియర్ కళాశాలలో 16 మంది గైర్హాజరయ్యారు. ఒక్క ఓరియంటల్ ప్రభుత్వ పాఠశాల కేంద్రంలోనే 29 మంది గైర్హాజరు కావడంపై పలువురు అసహనం వ్యక్తం చేశారు. ముఖ్యంగా సంబంధిత అధికారులు పరీక్షల ముఖ్యఉద్దేశ్యంపై విద్యార్థుల్లో అవగాహన కల్పించారా లేదా అని విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజలు చర్చించుకుంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి విద్యార్థులు సక్రమంగా పరీక్షలకు హాజరయ్యేలా చూడాలని కోరుతున్నారు.

గోరంట్లలో 66మంది...

గోరంట్ల: పట్టణంలో నిర్వహిస్తున్న పదోతరగతి ఫిజిక్స్ పరీక్షకు శనివారం 66మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు విద్యాశాఖాధికారులు తెలిపారు. గోరంట్లలోని ఆరు పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన సైన్సు పరీక్షకు 1270 మందికిగాను 1204మంది పరీక్షలు రాయగా, 66 మంది గైర్హాజరయ్యారు. న్యూమాంటిస్సోరి పాఠశాలలో 20 మంది, వివేకానందలో 11, శ్రీచైతన్య ఏ - సెంటర్ 13, బీ - సెంటర్‌లో ఐదుగురు, ప్రభుత్వబాలుర ఉన్నత పాఠశాలలో 17మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదు. పరీక్షా కేంద్రాలను డీఈఓ మీనాక్షి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రాల్లో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆమె అధికారులను మందలించారు. అంతేగాకుండా న్యూమాంటిస్సోరి, శ్రీవివేకానంద పరీక్షా కేంద్రాల్లో పనిచేస్తున్న చీఫ్‌లు, సూపరిండెంట్ల స్థానాల్లో కొత్తవారిని నియమించారు.

ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

అగళి, మార్చి 23 : ఆదర్శ పాఠశాలల్లో 2024-25వ సంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ జాఫర్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 28వ తేదీ నుంచి ఏప్రిల్ 22వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఓసీ, బీసీ, విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150 ప్రవేశ రుసుం చెల్లించాలన్నారు. పదో తరగతి ఉత్తీర్ణత, మెరిట్ ఆధారంగా రిజర్వేషన్ ప్రాతిపదికన ఎంపిక చేస్తారన్నారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపులో 40సీట్లు చొప్పున ఉంటాయన్నారు. గుర్తింపు పొందిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల నుంచి పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు. విద్యార్థికి కేటాయించిన జనరల్ నంబరు ఆధారంగా వెబ్‌సైట్‌లో దరఖాస్తు సమర్పించాలన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మద్యం షాపు గడువు పొడిగించొద్దు

ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు

హిందూపురం, మార్చి 23: పట్టణంలోని పెనుకొండ రోడ్డులో ఉన్న ఓ బార్ అండ్ రెస్టారెంట్‌కు ట్రేడ్ లైసెన్స్ పొడిగించకూడదంటూ రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు స్థానికులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ బార్ అండ్ రెస్టారెంట్‌ను మునిసిపాలిటీ స్థలానికి సంబంధించిన రోడ్డును ఆక్రమించి నిర్మించారన్నారు. దీనిపై కోర్టులో కూడా కేసు నడుస్తోందన్నారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిడితో గత మునిసిపల్ కమిషనర్ ట్రేడ్‌లైసెన్స్‌ను ఈనెల 31 వరకు మంజూరు చేశారని వారు పేర్కొన్నారు. కానీ వచ్చే యేడాది మార్చి 31వరకు ట్రేడ్ లైసెన్స్ మంజూరు చేయాలని ఆ బార్ అండ్ రెస్టారెంట్ యజమానులు మునిసిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారని, ఎట్టి పరిస్థితుల్లోనూ గడువు పొడిగించకూడదని వారు వినతిలో కోరారు. అందులోనూ మసీదుకు దగ్గరగా, ఇళ్ల మధ్యలో ఉండటంతో అక్కడ అనుమతి ఇవ్వకూడదని ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అంతేకాక అధికార పార్టీకి ఎన్నికల సమయంలో మద్యం సరఫరా చేస్తామని సాకుచూపి... ఎలాగైనా అధికార పార్టీ ఒత్తిళ్లతో ట్రేడ్ లైసెన్స్ గడువు పొడిగించేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు వారు ప్రకటనలో తెలిపారు.

పలువురిపై బైండోవర్ కేసులు

రొద్దం, మార్చి 23: త్వరలో జరుగబోయే సార్వత్రిక ఎన్నికల సందర్భంగా.. గ్రామీణ ప్రాంతాల్లో గొడవలు జరగకుండా పోలీసులు టీడీపీ, వైసీపీ పార్టీల పలువురు నాయకులు, కార్యకర్తలపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. రొద్దం మండలపరిధిలోని పెద్దగువ్వలపల్లి, రొద్దం, కంబాలపల్లి, బీదానిపల్లి, గ్రామాలకు చెందిన ఆ రెండు పార్టీల నాయకులు, కార్యకర్తలపై శనివారం బైండోవర్ కేసులు నమోదుచేసి ఇన్‌చార్జ్ తహసీల్దార్ చంద్రశేఖర్ వద్ద హాజరు పరిచారు. వచ్చే ఎన్నికల్లో ఎలాంటి గొడవలకు పాల్పడినా ముందస్తు అనుమతి లేకుండా అరెస్ట్ చేస్తామని వారిని హెచ్చరించారు. బైండోవర్ అయిన వారిలో మాజీ జడ్పీ టీసీలు చిన్నప్పయ్య, నరసింహులు, హరీష్, మురళి, సర్పంచ్ మంజునాథ్, సూరి, రుద్రప్రసాద్ తదితరులు ఉన్నారు.

పోషణ్ పక్వాడాపై అవగాహన

రొళ్ల, మార్చి 23: మండలంలోని దొమ్మరహట్టి గ్రామంలో శనివారం పోషణ్ పక్వాడా గురించి ఐసీడీఎస్ సీడీపీఓ నాగమల్లేశ్వరి అవగాహన కల్పించారు. ఆహార సూచికలు అందులో ప్రదర్శించి తీసుకొనే ఆహారంలో ప్రొటీన్లు, విటమిన్ల గురించి అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సన్నమ్మ, లీలావతి, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

హిందూపురం, మార్చి 23: పట్టణంలోని త్యాగరాజ నగర్‌లో నివాసముంటున్న సరళ (34) అనే మహిళ ఆత్మహత్య చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ శ్రీనివాసులు తెలిపారు. కొన్నాళ్ల కిందట సరళ భర్త మృతి చెందాడు. అప్పటి నుంచి ఆమె చాకలి బాబు అనే వ్యక్తితో సహజీవనం చేస్తోంది. అయితే శనివారం సాయంత్రం తన ఇంట్లోనే ఫైకప్పునకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడి నట్లు బాబు సమాచారం ఇచ్చాడని సీఐ తెలిపారు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. అనంతరం మృత దేహాన్ని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. అయితే అక్కడ ఆనవాళ్లను బట్టి అనుమానాస్పద స్థితిలో ఆమె మృతి చెందినట్లు పలువురు అనుమనిస్తున్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

రొళ్ల, మార్చి 23: మండలంలోని అలుపనపల్లి లో అక్రమంగా కర్నాటక మద్యం అమ్ముతున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. అతడి వద్ద నుంచి 20 ఒరిజనల్‌ఛాయిస్, గిరెక్స్ విస్కీ 90ఎంఎల్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అతడిపై కేసు నమోదు చేశామన్నారు.

భక్తుల ఆరాధ్యదైవం కనుమ లక్ష్మీనరసింహుడు

రేపు బ్రహ్మరథోత్సవం



కనుమ లక్ష్మీనరసింహస్వామి మూలవిరాట్

చిలమత్తూరు, మార్చి 23: ప్రతి సంవత్సరం భక్తి శ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహించే కనుమ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మరథోత్సవం కోసం ఆలయ కమిటీతో పాటు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మండల ప్రజల ఆరాధ్య దైవమైన శ్రీభూనీళా సమేత కనుమ లక్ష్మీనరసింహస్వామి బ్రహోత్సవాలు ఈ నెల 21 నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామి వారికి నిత్య పూజలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం ఉదయం స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు, ధవనోత్సవం, దీపోత్సవం, హనుమంత వాహనోత్సవం నిర్వహించారు. ఆదివారం భక్తులకు అత్యంత విశిష్టమైన స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు. మధ్యాహ్నం 11 గంటల నుంచి 11.45 గంటల లోగా అభిజిత్ లగ్నాన భూదేవి, శ్రీదేవి సహిత స్వామి వారి కల్యాణం జరుగుతుందన్నారు. అనంతరం అదేరోజు సాయంత్రం 6 గంటలకు సహస్ర దీపాలంకరణ, గరుడ వాహనోత్సవం నిర్వహిస్తామన్నారు. అలాదే ఈ నెల 25న సోమవారం స్వామి వారి బ్రహ్మరథోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం 26న ముత్యాల పల్లకి సేవ, దోపుతిరునాళ్ల, 27న వసంతోత్సవం, ధ్వజావరోహణం, ఉయ్యాలోత్సవం జరుగుతాయన్నారు. ఈనెల 28న శయనోత్సవం, పుష్పయాగోత్సవం, 29న సుప్రబాతసేవతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

రథోత్సవానికి ఏర్పాట్లు



రథాన్ని సిద్ధం చేస్తున్న దృశ్యం

కనుమ లక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మరథోత్సవం ఈ నెల 25న జరుగుతుంది. ఈ సందర్భంగా 36 అడుగుల ఎత్తు కలిగిన బ్రహ్మరథంలో స్వామి వారు దేవేరులతో ఆసీనులై మండల కేంద్రంలోని ప్రధాన వీధుల్లో ఊరేగుతారు. ఆల యంలో ఉన్న స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో తీసుకొచ్చి రథంపై ఆశీనులను చేస్తారు. ఇప్పటికే ఆలయ సేవకులు బ్రహ్మరథానికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవానికి సిద్ధం చేశారు. బ్రహ్మరథోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్ఐ గంగాధర్ తెలిపారు. ట్రాఫిక్‌ని క్రమబద్ధీకరిస్తూ, వాహనాలను దారి మళ్లించే ఏర్పాట్లుపై సమీక్షించారు.

ఎన్నికల కోడ్‌తో రాజకీయాలకు నో ఎంట్రీ

సాధారణంగా ప్రతి సంవత్సరం రథోత్సవానికి ముఖ్య అతిథులుగా రాజకీయ నాయకులను స్థానికులు అహ్వానిస్తుంటారు. వారు వచ్చిన సందర్భాల్లో బాణసంచా కాల్చడం, ఫ్లెక్సీలు పెట్టడం, ఆయా నాయకులకుతో ఊరేగింపుగా వెళ్లడం, పార్టీలకు మద్దతుగా నినాదాలు చేయడం జరిగేది. ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో ఎన్నికల నిబంధనలను ప్రతిఒక్కరూ పాటించాలని ఇప్పటికే రాజకీయ నాయకులకు అధికారులు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.

గెలుపు కోసం సమష్టిగా పనిచేద్దాం

మాజీ ఎమ్మెల్యే ఈరన్న



మణూరులో టీడీపీ నాయకులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఈరన్న

మడకశిర రూరల్, మార్చి 23: నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు విభేదాలు విస్మరించి, ఐక్యంగా పనిచేసి, పార్టీ విజయానికి కృషిచేద్దామ మాజీ ఎమ్మెల్యే మద్దనకుంట ఈరన్న పిలుపునిచ్చారు. మండలంలోని మణూరులో శనివారం టీడీపీ నాయకులు, కార్యకర్తల సమావేశం ఏర్పాటుచేశారు. ముందుగా గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో టీడీపీ నాయకులు,కార్యకర్తల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఈరన్న మాట్లాడుతూ ... నియోజకవర్గంలో నాయకులు తమ మధ్య ఉన్న చిన్ని చిన్న విభేదాలు మర్చిపోయి పార్టీ కోసం కలిసి కట్టుగా పనిచేయాలని కోరారు. తద్వారా టీడీపీ అధినేత చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఈ సందర్భగా మణూరు పంచాయతీ పరిధిలో టీడీపీ రెండు వర్గాల నాయకులను కలిపారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి సునీల్ కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు ఆదినారాయణ, అశ్వత్థామప్ప, బొజ్జప్ప, మండల మాజీ కన్వీనర్ రామాంజనేయులు, మంజునాథ్, నరేశ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోండి

హిందూపురం అదనపు జిల్లా కోర్టు న్యాయాధికారి శైలజ

హిందూపురం, మార్చి 23 : క్షణికావేశంలో చేసిన తప్పులతో జైలుజీవితం అనుభవిస్తూ న్యాయం పొందలేని అర్హులందరికీ ఉచితంగా న్యాయ సహాయం అందజేస్తామని అదనపు జిల్లా కోర్టు న్యాయాధికారి కంపల్లె శైలజ అన్నారు. స్థానిక కోర్టు ఆవరణంలో శనివారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ... చాలా మంది ఆర్థిక స్థోమతలేక న్యాయవాదులను ఏర్పాటు చేసుకోలేక ఇబ్బంది పడుతుంటారని అన్నారు. అలాంటి వారికి ఉచితంగా న్యాయ సహాయం అందజేస్తామని తెలిపారు. న్యాయ సహాయం అవసరమైన వ్యక్తులు దరఖాస్తు చేసుకుంటే జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయవాదులను ఏర్పాటు చేస్తామని, ఈ అవకాశాన్ని అర్హత కలిగినవారు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు సుదర్శన్, శ్రీనివాసరెడ్డి, వన్నూరప్ప, పార్వతి, భరత్, రవిచంద్ర, గోపాల్, ఎస్ఐ హరుణ్‌బాష, లైజినింగ్ అధికారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కోడ్ వచ్చి వారమైనా తొలగని బోర్డులు



కార్యాలయంపై ఉన్న వైఎస్ఆర్ బోర్డును తొలగించని దృశ్యం

మడకశిర రూరల్, మార్చి 23 : ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చి ఏడు రోజులవుతున్నా పశుసంవర్ధక శాఖ అధికారులు మాత్రం నిర్లక్ష్యం వీడలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. మడకశిరలోని వైఎస్ఆర్ నియోజకవర్గ స్థాయి పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాల కార్యాలయంపై ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఉన్న బోర్డులను ఇప్పటి వరకు తొలగిం చలేదు. కార్యాలయంపై ఉన్న శిలాఫలకం బోర్డు కూడా అలాగే ఉంది.

అదిష్టానం పిలుపుతో సమావేశం వాయిదా

మడకశిర టౌన్, మార్చి 23: పట్టణంలోని యాదవ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించాల్సిన తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని వాయిదావేసినట్లు టీడీపీ పట్టణ అధ్యక్షుడు మనోహర్ శనివారం తెలిపారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామికి పార్టీ అధిష్టానం నుంచి పిలుపు రావడంతో ఆయన విజయవాడకు వెళ్లారని తెలిపారు. కావున సమావేశాన్ని వాయిదా వేసినట్లు తెలిపారు. తదుపరి తేదీలు ప్రకటించే వరకు సమావేశం ఉండదని తెలిపారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల నాయకులు, కార్యకర్తలు గమనించాలని కోరారు.

పట్టణంలో టీడీపీ నాయకుల ప్రచారం



ప్రచారంలో పాల్గొన్న సవిత భర్త వెంకటేశ్వరరావు, టీడీపీ శ్రేణులు

పెనుకొండ టౌన్, మార్చ 23: టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత భర్త వెంకటేశ్వర్‌రావు శనివారం టీడీపీశ్రేణులతో కలిసి పట్టణంలోని దర్గాపేటలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ మేనిఫెస్టో, సూపర్‌సిక్స్ పథకాలపై మైనార్టీలకు అవగాహన కల్పించారు. అలాగే ఐదు సంవత్సరాల వైసీపీ పాలన దర్గాపేటలో ఏ అభివృద్ధీ చేసిన పాపానపోలేదని కాలనీవాసులు టీడీపీ నాయకుల వద్ద మొరపెట్టుకున్నారు. ఈ ప్రాంతాలు స్లమ్ ఏరియాను తలపించేలా అధికార పార్టీ వైసీపీ నాయకులు తీర్చిదిద్దారని మండిపడ్డారు. మంచినీటి సమస్య ఉందని నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. రెండు నెలలు ఆగాలని, వచ్చేది టీడీపీ ప్రభుత్వమే అని నాయకులు తెలిపారు. త్వరలోనే తమ సమస్యలు శాశ్వతంగా పరిష్కారం అవుతాయన్నారు. టీడీపీ నాయకులు త్రివేంద్ర నాయుడు, దాదు, ఖన్నా, రఘువీరచౌదరి, సుబ్రహ్మణ్యం, షమున్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు ఇవ్వలేం

కర్ణాటక మాజీ మంత్రి వెంకటరమణప్ప

పావగడ, మార్చి 23: వచ్చే లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ ఎంపీ అభ్యరిగా అధిష్టానం నియమించిన బీఎన్ చంద్రప్పకు తమ మద్దతు ఉండదని కాంగ్రెస్ నాయకుడు, మాజీ మంత్రి వెంకటరమణప్ప అన్నారు. ఆయన ఈ మేరకు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో 2023 సంవత్సరంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పావగడ ఎస్సీ నియోజకవర్గానికి చంద్రప్ప కూడా దరఖాస్తు చేసుకున్నారని తెలిపరు. అయితే ఆయన తన కుమారురు ప్రస్తుత ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్‌కు టికెట్ రాకుండా అడ్డుపడటమే కాకుండా కాంగ్రెస్ అభ్యర్థిని ఓడించాలని జేడీఎస్ అభ్యర్థితో కుమ్మక్కై వర్గ రాజకీయాలు చేశారని ఆరోపించారు. ఈనేపథ్యంలో చంద్రప్పకు తప్ప మరెవరికైనా టికెట్ ఇస్తే తాము కాంగ్రెస్ పార్టీపరంగా పనిచేస్తామన్నారు. కాంగ్రెస్ అధిష్టానం పిలుపు మేరకు శనివారం వెంకటరమణప్ప బెంగళూరుకు వెళ్లి నాయకులతో చర్చించినట్లు తెలిసింది.

కాంగ్రెస్ నాయకులను కలుపుకొని వెళతాం

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చంద్రప్ప

పావగడ, మార్చి 23: రానున్న పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ అధిష్టానం తనను చిత్రదుర్గం ఎంపీ అభ్యర్థిగా ప్రకటించిదని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి బీఎన్ చంద్రప్ప తెలిపారు. ఆయన శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం ఏప్రిల్ నెలలో జరిగే పార్లమెంటు ఎన్నికలకు చిత్రదుర్గం పార్లమెంటు నియోజకవర్గం వ్యాప్తంగా ఏడుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉండటంతో తమకు ఏనుగు బలం కలిసి వచ్చిందన్నారు. తాను 2014 సంవత్సరంలో ఈ ప్రాంతం ప్రజలు ఎంతో చేయూతనిచ్చి తనను గెలిపించారని అన్నారు. అలాగే మాజీ మంత్రి వెంకటరమణప్ప అడుగు జాడల్లోనే తన అధికార సేవలు కూడా అందించాన అన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఎటువంటి విభేదాలులేవన్నారు. మాజీ మంత్రి వెంకటరమణప్ప, ఆయన కుమారుడు ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్‌ను త్వరలోనే కలుసుకొని కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటామని తెలిపారు. రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడానికి కాంగ్రెస్ గెలుపు ఎంతో అవసరం అని ఆయన తెలియపరిచారు.

డ్రైవర్ నిర్లక్ష్యానికి ఒకరి మృతి

పుట్టపర్తి రూరల్, మార్చి 23: డ్రైవర్ నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలైంది. జిల్లాకేంద్రంలో లెక్కల దామోదర్ నాయుడు (45) హోటల్‌ను నిర్వహించేవారు. స్థానికంగా ఉన్న ఈశ్వరమ్మ పాఠశాలలో 7వతరగతి చదువుతున్న కుమారుడు కార్తీక్‌కు మధ్యాహ్నం 12 గంటల సమయంలో భోజనం క్యారియర్ ఇచ్చేందుకు స్కూటీలో బయలుదేరాడు. ప్రైమరీస్కూల్ గేట్ ఎదురుగా రోడ్డులో అడ్డంగా నిలిపి ఉన్న ఇన్నోవా వాహన డ్రైవర్ కుడి పక్కన డోరును చూసుకోకుండా.. సడెన్‌గా తీశాడు. దీంతో పక్కనే వెళ్తున్న దామోదర్ నాయుడుకు బలంగా తగలడంతో కిందపడిపోయాడు. స్థానికులు అతడిని సత్యసాయి జనరల్ హాస్పిటల్‌కు తరలించారు. మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు తరలించారు. అక్కడ ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యులు పరిశీలించి అప్పటికే అతను మృతి చెందినట్లు ధ్రువీకరించారు.మృతుడి అన్న లోకేష్‌నాయుడు పుట్టపర్తి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పుట్టపర్తి అర్బన్ సీఐ కొండారెడ్డి కేసు విచారణ చేపట్టారు.

చెక్‌పోస్ట్ తొలగింపు



మంత్రి ఇంటి వద్ద ఉన్న చెక్‌పోస్టును తొలగించిన దృశ్యం

పెనుకొండ టౌన్, మార్చి 23 : పట్టణంలో రాష్ట్ర మంత్రి ఉషశ్రీ చరణ్ ఇంటి ఎదుట ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను ఎట్టకేలకు పోలీసులు తొలగించారు. 'మంత్రి ఇంటికి చెక్‌పోస్ట్' అనే శీర్షికతో శుక్రవారం ఆంధ్రజ్యోతిలో కథనం వెలువడిన విషయం విదితమే. దీనికి స్పందించిన పోలీసులు వెంటనే చెక్‌పోస్టును తొలగించారు. ఈ విషయమై పోలీసులు మాట్లాడుతూ ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం స్టాపర్లు, బారికేడ్లు ఏర్పాటు చేశామన్నారు. అక్కడ ఏర్పాటు చేసింది ఎన్నికల కోడ్ పరిధిలోకి రాదన్నారు. అయినా బారికేడ్లను ఆ స్థలం నుంచి తొలగించినట్లు తెలిపారు.

మారుతీనగర్‌లో తాగునీటి సమస్య పరిష్కారం

మడకశిరటౌన్, మార్చి 23: పట్టణంలోని మారుతీనగర్ 17వవార్డులో 15 రోజులుగా తాగునీటి సమస్య నెలకొంది. దీనిపై శనివారం ఆంధ్రజ్యోతిలో మడకశిరలో తాగునీటి ఎద్దడి అనే శీర్షికతో కథనం ప్రచురితమైన విషయం విదితమే. దీనిపై స్పందించిన నగర పంచాయతీ అధికారులు మరమ్మతులకు గురైన మోటారును రిపేరు చేయించారు. సాయంత్రం 3 గంటలకు కాలనీలో నీటి సరఫరాను పునరుద్ధరించారు. అదేవిధంగా పలు కాలనీలకు వెళ్లి నీటి సమస్యపై ఆరాతీసి పరిష్కారానికి చర్యలు తీసుకొన్నారు.



మోటారుకు మరమ్మతులు చేసి అమర్చిన తాగునీటి బోరు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వర్క్‌షాప్‌లో పాల్గొన్న టీడీపీ అభ్యర్థులు



వర్క్‌షాప్‌లో పాల్గొన్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు సవిత, సునీల్‌కుమార్

పెనుకొండ టౌన్/ మడకశిర టౌన్, మార్చి 23: విజయవాడలో శనివారం టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో జరిగిన వర్క్‌షాపులో ఆ పార్టీ పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత, మడకశిర అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ పాల్గొన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన తరపున పోటీ చేస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు వర్క్‌షాప్ ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. అధినేత సూచనల మేరకు పార్టీ గెలుపేలక్ష్యంగా అందరం సమష్టిగా కృషి చేస్తామని వారు ఫోన్ ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను కలిసినట్లు సవిత తెలిపారు. చురుగ్గా ఎన్నికల ప్రచారం చేపట్టాలని ఆయన సూచించినట్లు తెలిపారు. పెనుకొండను భారీ మెజార్టీతో గెలుపొంది గిఫ్ట్‌గా ఇస్తానని లోకేశ్‌కు చెప్పినట్లు ఆమె తెలిపారు.

దివ్యాంగులు ఇంటి వద్ద నుంచే ఓటు వేయొచ్చు : అధికారులు



బీఎస్‌ఓలతో మాట్లాడుతున్న తహసీల్దార్, కమిషనర్

హిందూపురం అర్బన్, మార్చి 23: దివ్యాంగులు, 85 సంవత్సరాల వయసు మీరిన వృద్ధులకు ఇంటి వద్ద నుంచే ఓటు హక్కు వినియోగించుకొనే అవకాశాన్ని తొలి సారి ప్రభుత్వం కల్పించిందని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, హిందూపురం తహసీల్దార్ శివప్రసాద్ రెడ్డి, మునిసిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. వారు శనివారం స్థానిక మునిసిపల్ కార్యాలయంలో అర్బన్ బూత్ స్థాయి అధికారుల సమావే శం ఏర్పాటు చేశారు. ఇందు కోసం ఫారం 12డి ద్వారా దరఖాస్తు చేసుకోవాల న్నారు. అదే విధంగా 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. వారి కోసం ఫారం 6 దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎన్నికల నిబంధనలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎన్నికల డీటీ రెడ్డి శేఖర్, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారాల్లో పాల్గొంటే చర్యలు

ఎఫ్‌పీ షాపు డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో తహసీల్దార్

అగళి, మార్చి 23 : సార్వత్రిక ఎన్నికల సందర్భంగా కోడ్ అమలులో ఉన్నందున.. ఎఫ్‌పీ షాప్ డీలర్లుకానీ, ఎండీయూ ఆపరేటర్లు కానీఏ పార్టీ తరుపున అయినా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. వారిని విధుల నుంచి తొలగిస్తామన్నారు. ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలపై ఫొటో లేదా వీడియో లేదా ఆడియో రూపంలో రికార్డు చేసినసాక్ష్యంతో విజిల్‌యాప్ ద్వారా అప్లోడ్ చేయవచ్చన్నారు. ఫిర్యాదు చేసిన ఐదు నిమిషాల్లో ఎన్నికల అధికారులు రంగంలోకి దిగుతారన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎఫ్‌పీ షాపు డీలర్లు, ఎండీయు ఆపరేటర్లతో ఆయన శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ... ఈ నెల 20వ తేదీలోగా సంబంధిత రేషన్ సరుకులకు డీడీలు తీయాల్సి ఉంటుందన్నారు. ప్రజలు ఏప్రిల్ 17వ తేదీలోగా వారి రేషన్‌సరుకులను ఆ ప్రాంతంలోకి ట్రక్ వచ్చినప్పుడు పొందాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తమసీల్దార్ సుబ్బరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గుర్రన్న, వీఆర్‌ఓ వరలక్ష్మి, డీలర్లు పాల్గొన్నారు.

'పురం ఎంపీ టిక్కెట్ బీజేపీకి కేటాయించాలి'

పెనుకొండ రూరల్, మార్చి 23 : హిందూపురం పార్లమెంట్ టిక్కెట్‌ను బీజేపీకే కేటాయించాలని ఆ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. పెనుకొండ పట్టణంలోని ఆర్యవైశ్య సంఘం కల్యాణమండపంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. బీజేపీ సారథ్యంలో దేశం ఎంత అభివృద్ధి చెందుతోందో హిందూపురం ప్రాంతం కూడా అంతే అభివృద్ధి చెందాలంటే బీజేపీకి హిందూపురం పార్లమెంట్ స్థానం కేటాయిం చాలన్నారు. ఈ విషయాన్ని కేంద్ర, రాష్ట్ర నాయకత్వాలు గుర్తించి, అందుకు అనుగుణంగా ప్రకటన చేయాలని కోరుతున్నామన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా కార్యదర్శి రామకిష్టప్ప, కోకన్వీనర్ రవి, మధుసుదన్, బద్రీనాథ్, ఈశ్వర్‌రెడ్డి, వేణుగోపాల్, బాలగోపాల్, బాలాజీ, కిష్టప్ప, ముత్యాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపడుతాం

అవదూత గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్ వెల్లడి



విలేకరులతో మాట్లాడుతున్న మహేంద్రనాథ్ శర్మ

హిందూపురం, మార్చి 23 : స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆధ్వర్యం లో నియోజకవర్గంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని అవదూత గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్ మహేంద్రనాథ్ శర్మ పేర్కొన్నారు. ఆయన శనివారం పట్టణంలో విలేకరులతో మాట్లాడుతూ..... నియోజకవర్గంలో విద్య, వైద్యానికి తమ ఫౌండేషన్ ఎక్కువ దృష్టిసారిస్తుందన్నారు. పల్లెల్లో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తామని, విద్యార్థులకు అవసరమైన విద్యా సామాగ్రి అందజేస్తామని తెలిపారు. మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తామన్నారు. అలాగే నియోజకవర్గంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలకు తమవంతు సహకారం అందిస్తామన్నారు. ఇప్పటికే లేపాక్షి మండలం నాగానపల్లిలో రూ.50లక్షలతో శివాలయం కట్టిస్తున్నామన్నారు. అయితే త్వరలోనే ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ చేతులమీదుగా సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుడతామన్నారు. వాటికి అందరూ సహకరించాలని కోరారు. ఇప్పటికే దేశంలో పలు చోట్ల అవదూత గ్లోబల్ ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, ఇప్పుడు హిందూపురం నియోజకవర్గంలో చేపట్టనున్నట్లు వారు తెలిపారు. ముఖ్యంగా హిందూపురం నందమూరి తారకరామారావు ప్రాతినిధ్యం వహించినందు వల్ల దీనిపై తమకు మక్కువ ఉందన్నారు.

చెన్నకేశవ స్వామికి టీడీపీ ప్రత్యేక పూజలు



చెన్నకేశవ స్వామికి పూజలు చేస్తున్న టీడీపీ నాయకులు

గోరంట్ల, మార్చి 23: మండలంలోని మేరెడ్డిపల్లి వద్దగల చెన్నకేశవస్వామి ఆలయంలో టీడీపీ నాయకులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పార్థసారథికి టిక్కెట్ కేటాయింపులో నెలకున్న ఉత్కంఠ పరిస్థితుల్లో ఎర్రయ్యగారిపల్లికి చెందిన టీడీపీ మండల మహిళ అధ్యక్షురాలు ప్రభావతమ్మ మొక్కుకున్నారు. బీకేకు ఎంపీ టిక్కెట్ లభించడంతో ప్రభావతమ్మ, నీలకంఠారెడ్డి దంపతులు స్వామికి మొక్కు తీర్చుకున్నారు. నాయకుల సమక్షంలో స్వామికి ప్రత్యేక పూజలు చేసి, 101 టెంకాలు సమర్పించారు. ఎన్నికల్లో పార్థసారథి ఘన విజయం సాధించాలని, చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని పూజించారు. ఈకార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి నరసింహప్ప, అశ్వత్థరెడ్డి, బెల్లాలచెరువు చంద్ర, ప్రభాకర్, నరసరామ్, గంగిరెడ్డి, నరేంద్రరాయల్, ఫిరోజ్‌బాషా, శ్రీధర్, చిన్నరాయల్, ఉమాశంకర్, అగ్గిశం భరత్, టైలర్ రుద్ర, పురుషోత్తం, బాలక్రిష్ణ తదితరులున్నారు.